







బాలాయపల్లి వెంకటరెడ్డి పల్లి సమీపంలో ఉన్న నేరేడు బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద నీరు



నాయుడుపేట మండలం తనమాలలో కోతకు గురైన రోడ్డు

● దిత్వా ఎఫెక్ట్

● పొంగుతున్న నదులు, వాగులు ● పలు మార్గాల్లో స్తంభించిన రాకపోకలు
● వేలాది ఎకరాల్లో మునిగిన వరిపొలాలు ● రూ.35 కోట్ల మేర నష్టం

వదలని వాన



సురక్షిత ప్రాంతాలకు రావాలని కోట మండలం పుచ్చలపల్లి గ్రామస్థులను కోరుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను బలహీనపడినా.. దాని ప్రభావం మాత్రం వీడలేదు. వరుసగా ఐదో రోజూ తీర ప్రాంత, చేరువగా ఉన్న మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. గురువారం తూర్పు మండలాల్లో నదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దాదాపుగా చెరువులు, కుంటలు నిండాయి. స్వర్ణముఖి బ్యారేజీ సహా కాళంగి, మల్లిమడుగు రిజర్వాయర్ల నుంచీ నీటిని దిగువకు వదులుతున్నారు. ఆయా మండలాల్లో పరిస్థితులను గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు పాశం సునీల్ కుమార్, కురుగొండ రామకృష్ణ, విజయశ్రీ తదితరులు పరిశీలించారు.

గూడూరుపై తీవ్ర ప్రభావం : గూడూరులో బుధవారం రాత్రి నుంచీ వర్షం పడింది. పట్టణంలో పంబలేరు వాగు పొంగడంతో కాజ్‌వేపైకి నీరు చేరి వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. వేములపాడు, తిప్పవరప్పాడు వద్ద కాజ్‌వేలపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గూడూరు చవటపాలెం.. నెల్లటూరు.. చెన్నూరు రామలింగయ్య ఎస్టీ కాలనీల్లోకి వర్షపు నీరు చేరింది. చెన్నూరులో చేనేత మగ్గాల గుంతల్లోకి నీరు చేరడంతో 200 మంది కార్మికులు పనులు నిలిపివేశారు. 1700 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది.

● చిల్లకూరు మండలం తిప్పగుంటపాలెం ఇంకా జలదిగ్బంధనంలోనే వుంది. వరగలి క్రాస్ వద్ద జాతీయ రహదారిపైకి వరద నీరు చేరడంతో కిలోమీటరు వరకూ వాహనాలు నిలిచిపోయాయి.

● చిట్టమూరు మండలం పుట్టివానిపల్లి జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆరూరు చెరువు కట్ట ప్రమాదకర స్థితికి చేరింది.

● కోట మండలం నెల్లూరుపల్లి ప్రాథమిక పాఠశాలలోకి, కొత్తపాలెం దళితవాడలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. స్వర్ణముఖి ఉధ్రుత ప్రవాహంతో దైవాలదిబ్బ, పుచ్చలపల్లి, దొరువుకట్ట అల్లంపాడు గ్రామాల వద్ద స్వర్ణముఖి పొర్లుకట్టలు తెగిపోయే స్థితిలో ఉన్నాయి. గోవిందపల్లి వద్ద బకింగ్‌హామ్ కెనాల్ ప్రవాహంతో గోవిందపల్లిపాలెం మత్స్యకారులకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

● వాకాడు ఎస్సీ కాలనీ, వెంకటరెడ్డిపాలెం, బూర్లవారిపాలెం, తూపిలిపాలెం ఎస్టీ కాలనీలను వరద చుట్టుముట్టింది. స్వర్ణముఖి బ్యారేజీలోకి భారీగా వరద నీరు చేరుతుండడంతో 13 గేట్లు తెరిచి నీటిని వదిలారు.

20 మండలాల్లో రికార్డు స్థాయి వర్షపాతం

ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 20 మండలాల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. వాకాడు మండలంలో ఏకంగా 52 సెంటీమీటర్లకు పైగా.. మిగిలిన 19 మండలాల్లో 20 నుంచి 40 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత నెల 30వ తేది ఉదయం 8.30 నుంచి ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లాలో సగటున 215.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

మండలం	వర్షపాతం (మిల్లీ మీటర్లలో)
వాకాడు	525.5
చిట్టమూరు	494.8
గూడూరు	446.6
కోట	423.2
చిల్లకూరు	405.8
బాలాయపల్లి	271.8
వెంకటగిరి	213.8
డక్కిలి	210.4
దొరవారిసత్రం	353.4
ఓజిలి	309.6
నాయుడుపేట	289.2
తొట్టంబేడు	274.4
సూళ్ళూరుపేట	270.4
పెళ్ళకూరు	269.4
ఏర్పేడు	244.0
సత్యవేడు	240.2
తడ	234.4
శ్రీకాళహస్తి	224.2
బీఎన్ కండ్రిగ	222.2
వరదయ్యపాలెం	217.0
జిల్లా సగటు	215.3 మిల్లీమీటర్లు

వర్షాల నష్టం రూ.35 కోట్లు : వరుస వర్షాలకు రూ.35 కోట్లకు పైగా నష్టం సంభవించినట్లు ప్రాథమిక అంచనా. 11 మండలాల్లోని 69 గ్రామాలు ఎక్కువగా ప్రభావితమయ్యాయి. 1726 మంది కష్టనష్టాలకు లోనయ్యారు. దొరవారిసత్రం, సూళ్ళూరుపేట, వాకాడు, తడ, పెళ్ళకూరు మండలాల్లో 1821 హెక్టార్లలో వరి పంట నీటమునిగింది. అనధికారిక అంచనాల ప్రకారం 12 వేల ఎకరాలకు పైగా వరిపొలాలు దెబ్బతిన్నాయి.

దెబ్బతిన్న 41 ఇళ్ళు : వాకాడు మండలంలో 8 కచ్చా ఇళ్ళు పూర్తిగా కూలాయి. బాలాయపల్లిలో 4, వెంకటగిరిలో 3, చిట్టమూరులో ఒకటి చొప్పున 8 కచ్చా ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కోట మండలంలో 7, ఏర్పేడులో 15, బీఎన్ కండ్రిగ, శ్రీకాళహస్తి, తొట్టంబేడులో ఒక్కోటి చొప్పున 25 పూరి గుడిసెలు పడిపోయాయి. వీటి విలువ రూ.12.2 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. ఒక ఆవు, గొర్రె మృతి చెందాయి.

విద్యుత్ శాఖకు రూ. 17.43 కోట్లు

గాలులకు 33 కేవీ ఫీడర్లు ఏడు, 33-11 కేవీ ఫీడర్లు 62 దెబ్బతిన్నాయి. అలాగే 33-11 కేవీ సబ్ స్టేషన్లు ఏడు, 11 కేవీ స్తంభాలు ఎనిమిది, ఎల్‌టీ స్తంభాలు ఎనిమిది చొప్పున కూలిపోయాయి. మొత్తం మీద రూ. 17.43 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేశారు.

పాడైన రోడ్లు

జిల్లావ్యాప్తంగా 106 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రోడ్లు పాడయ్యాయి. చిట్టమూరులో ఒక రోడ్డు తెగిపోగా మరొకటి కోతకు గురైంది. వరద నీరు కాజ్‌వేలపై ప్రవహించడంతో మరో 30 రోడ్లు దెబ్బతిన్నాయి. ఆర్ అండ్ బీ రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు రూ. 16.34 కోట్లు, శాశ్వత పనులకు రూ.97 కోట్లు అవసరమని అంచనా వేశారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 70 రోడ్లు దెబ్బతినగా, మరమ్మతులకు రూ.82.76 లక్షలు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు.

1. నాగలాపురం: కొత్తగాడులో కాజ్‌వేపై నీటి ప్రవాహంతో రోగిని భుజాలపై మోసుకెళుతున్న యువకులు
2. శ్రీకాళహస్తి: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నీరు
3. తడ: కారిజాత చెరువుకు పడిన గండిని పూడ్చుతున్న గ్రామస్థులు
4. చిల్లకూరు: వరగలిక్రాస్ రోడ్డు వద్ద నిలిచిన వాహనాలు

వెంకటగిరిలో వాగుల ఉధ్రుతి

● వెంకటగిరి మండలంలో కైవల్య నది, గొడ్డేరు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. బంగారుపేటలో చేనేత మగ్గం గుంతల్లో నీరు చేరడంతో పనులు ఆగిపోయాయి. ● డక్కిలి మండలం లింగసముద్రం వాగు ఉధ్రుతంగా ప్రవహిస్తోంది. ● బాలాయపల్లి మండలంలో కైవల్య నది పొంగి రామాపురం బ్రిడ్జిపైకి చేరగా.. నేరేడు కాలువ పొంగడంతో వెంకటగిరి-గూడూరు మెయిన్ రోడ్డులో వెంకటరెడ్డిపల్లి వద్ద.. గొట్టికాడు వద్ద కాజ్‌వేపైనా వరద నీటి ప్రవాహంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

సూళ్లూరుపేటలోనూ అదే స్థితి

● పెళ్ళకూరు మండలంలోని చెంబేడు చెరువు కట్ట కుంగి ప్రమాదకర స్థితికి చేరుకుంది. కలవకూరు వద్ద స్వర్ణముఖి డ్యామ్.. నాయుడుపేట వద్ద పండ్లూరు కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తోంది. ● తడ మండలం ఇరకం దీవిలోని పొలాలను పులికాట్ ఉప్పు నీరు ముంచెత్తింది. ● నాయుడుపేట మండలం పెరికిలాంపాటి కండ్రిగ ముంపునకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. వెంగమాంబపురం వద్ద మామిడికాలువ ప్రవాహంతో వాహనాల రాకపోకలు ఆగాయి. ● దొరవారిసత్రం మండలం వేణుంబాక చెరువు కట్ట కుంగడంతో అధికారులు మరమ్మతులు చేపట్టారు.



కోట మండలం పుచ్చలపల్లి వద్ద బలహీనంగా ఉన్న స్వర్ణముఖిపొర్లుకట్టలను పరిశీలిస్తున్న తెలుగుగంగ సీఈ వరప్రసాద్, అధికారులు

నేడు పాఠశాలల్లో మెగా పీటీఎం 3.0

● 2513 ప్రభుత్వ విద్యాసంస్థల్లో పాల్గొననున్న 4,30,897 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు

తిరుపతి(విద్య), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో శుక్రవారం మెగా పీటీఎం (మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్) 3.0 జరగనుంది. జిల్లా సమగ్రశిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 2,323 పాఠశాలల్లో 3,68,422 మంది, 195 జూనియర్ కళాశాలల్లో 62,475 మంది చొప్పున 4,30,897 మంది విద్యార్థులు, వారు తల్లిదండ్రులు మెగా పీటీఎం సమావేశాలకు హాజరుకానున్నారు. డీఈవో కేవీఎన్ కుమార్ ఆధ్వర్యంలో పాఠశాలల్లోను, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలల్లోను ఏర్పాటు సాగుతున్నాయి. వీటి నిర్వహణకు ప్రభుత్వం పాఠశాలలకు రూ.44,93,250, కళాశాలలకు రూ.15 లక్షలు చొప్పున రూ.59,93,250 విడుదలచేసింది. విద్యార్థుల సంఖ్యనుబట్టి ఆయా పాఠశాలలకు, కళాశాలలకు నిధులను కేటాయించారు. ఇందులో భాగంగా పేరెంట్స్‌కు క్రీడా పోటీలు, విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పిల్లల చదువు, నడవడిక, ప్రగతి గురించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించి, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందించనున్నారు.

తిరుమలలో నేడు డయల్ యువర్ ఈవో

తిరుమల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరగనుంది. భక్తులు తమ సందేహాలు, సలహాలు, ఫిర్యాదులపై 0877 2263261 నెంబరును ఫోనుచేసి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో మాట్లాడొచ్చు.

దక్షిణ మధ్య రైల్వేలో ఓటీపీ లింక్‌తో తత్కాల్ టికెట్లు

తిరుపతి(సెంట్రల్),డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో ఇకపై ఓటీపీ లింక్‌తో తత్కాల్ టికెట్లు ఇవ్వనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రస్తుతం తిరుపతి నుంచి వివిధ మార్గాల్లో వెళ్లే వందేభారత్ రైళ్లలో ఈ పద్ధతి అమలు చేస్తున్నారు. 'ఆధార్‌తో లింక్‌అయిన ఫోన్ నెంబరు ఇవ్వాలి. టికెట్ బుక్ చేసే సమయంలో ఓటీపీ వచ్చాకే టికెట్ వస్తుంది' అని తెలిపారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు

● గ్రామస్థాయి నుంచి పార్లమెంటు స్థాయి వరకు కమిటీలు ● జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్



చిత్తూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తామని అని జనసేన అధ్యక్షుడు,డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. చిత్తూరు కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన డీడీవో కార్యాలయాన్ని గురువారం మధ్యాహ్నం ప్రారంభించిన ఆయన అదే ఆవరణలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. 'జనసేన బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ, పార్లమెంటు స్థాయి వరకు ఐదుగురు సభ్యులతో కమిటీలను నియమిస్తాం. మరో 15 ఏళ్ల పాటే ఇదే స్ఫూర్తితో కొనసాగాలి. అప్పుడే అభివృద్ధి సుస్థిరమవుతుంది. కూటమి నాయకులతో చిన్న కమ్యూనికేషన్ గ్యాప్స్ ఉంటే కలిసి మాట్లాడుకుని పరిష్కరించుకోండి. వైసీపీ హయాంలో ఈ జిల్లాకే తలమానికమైన శేషాచలం అడవుల్ని అడ్డగోలుగా దోచేశారు. ఇప్పటివరకు దొరికిన సంపద 10 శాతం మాత్రమే. ఇదే రూ.వేల కోట్లలో ఉంటే.. దొరకనిది ఇంకెన్ని రూ.వేల కోట్లు ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. అలాంటి వాళ్లను మనం నిలువరించాలి'అన్నారు. గత నెలలో తిరుపతి, పలమనేరు ప్రాంతాల్లో పర్యటించిన పవన్ తమను పట్టించుకోలేదని జనసేన శ్రేణులు అసంతృప్తి చెందినట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఈసారి జనసేన శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గ్రామాల్లో కూడా బెంజి కార్లు వెళ్తున్నాయంటే మీరు నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో జరిగిన అభివృద్ధే కారణమని పవన్‌ను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అభినందించారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును అక్రమంగా జైలులో పెట్టినప్పుడు.. మీరిచ్చిన సపోర్టు మరువలేనిదని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు.సీఎం అనుభవం, మీ సామర్థ్యంతోనే పీఆర్, ఆర్‌డీ శాఖలు బలోపేతమవుతున్నాయని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్ చెప్పారు. జనసేనకు నియోజకవర్గ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో మరింత బలోపేతం చేసేలా ప్రణాళికలు రచిస్తున్నామని హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, జనసేన నేత హరిప్రసాద్ చెప్పారు. కాగా, మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరుకు చేరుకున్న పవన్ కల్యాణ్ 2.10గంటలకు తిరుగుపయనమయ్యారు. చిత్తూరు డీడీవో కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వర్చువల్ విధానంలో 77 డీడీవోల కార్యాలయాలను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.



డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని, పక్కన డీడీవో నారాయణరెడ్డి, నేతలు

జిల్లాలో డీడీవో కార్యాలయాల ప్రారంభం

తిరుపతిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్చువల్‌గా డీడీవో కార్యాలయాలను ప్రారంభించగా, జిల్లాలోనూ గూడూరులో అధికారులు, సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే విజయశ్రీ, శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయ పరిధిలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శక పాలన అందిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి రూరల్‌లో జరిగిన కార్యక్రమంలో డీడీవో నారాయణరెడ్డి, నేతలు ఎ.ఈశ్వర్‌రెడ్డి, మధు, సుధాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో పొరబాట్లు

● అర్హులకు అందని సంక్షేమ పథకాలు

చంద్రగిరి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో గత ప్రభుత్వంలో గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది చేసిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో పొరబాట్ల కారణంగా అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటివరకు సంక్షేమ పథకాలు అందడంలేదు. ఆరేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటా సర్వేలు నిర్వహించి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారు. రెండు, మూడు కుటుంబ సభ్యులను ఒకే కుటుంబంలో కలపడంతో సంక్షేమ పథకాలు ఎవ్వరికీ అందడంలేదు. చంద్రగిరి పంచాయతీ కోట గ్రామంలో రెండు వేర్వేరు కుటుంబ సభ్యులను ఒకే కుటుంబంగా కలిపి మ్యాపింగ్ చేశారు. దోర్నకంబాల పంచాయతీలో ఎలాంటి సంబంధమూ లేని మూడు కుటుంబాలను ఒకే మ్యాపింగ్ చేశారు. దోర్నకంబాల పంచాయతీ హరిజనవాడకు చెందిన ఓ దళిత వృద్ధుడు, దోర్నకంబాల గ్రామానికి చెందిన ఓ ముస్లిం కుటుంబం, మల్లయ్యపల్లెకు చెందిన అగ్రవర్ణాల కుటుంబాలను ఒకే మ్యాపింగ్ చేశారు. దీంతో ఆ దళిత వృద్ధుడికి పింఛన్ మంజూరు కాలేదు. మరో కుటుంబానికి రైతు భరోసా, అమ్మ ఒడి, ఇంటి స్థలం తదితర సంక్షేమ పథకాలు వర్తించలేదు. బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వంలోనూ ఫిర్యాదు చేసినా తమకు సంబంధం లేదని చెబుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆర్సీపురంలో భారీ వర్షం



రామచంద్రాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం భారీ వర్షం పలు దఫాలుగా కురిసింది. నాలుగు రోజులుగా జల్లులకే పరిమితమైన వర్షం గురువారం జోరుగా కురిసింది. చిన్నపాటి వంకలు పారాయి. అనుపల్లి నుంచి వచ్చే పెద్దేటి వంక ఉధృతి పెరగడంతో రాయలచెరువుకు భారీగా నీరు చేరింది. వర్షం కారణంగా ప్రధాన రహదారిపై ఎక్కడికక్కడ వాహన చోదకులు గంటల తరబడి నిలబడిపోయారు. నాలుగు రోజులుగా వర్షం కురుస్తుండటంతో వ్యవసాయ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. చిన్నపాటి వ్యాపారులు, కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు.

కారు ఢీకొని కూలీ మృతి

చంద్రగిరి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొంగరవారిపల్లె వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో కారు ఢీకొనడంతో కూలీ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ఒడిశాకు చెందిన తిరుపతి(43) ఎం.కొంగరవారిపల్లెలో ఓ హోటల్లో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో తిరుపతి రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్న కారు ఢీకొంది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

స్క్రబ్ టైఫస్ జ్వరాలపై ఆందోళన వద్దు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉదయశ్రీ

తిరుచానూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ జ్వరాలపై ఆందోళన పడవద్దని దామినేడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయశ్రీ అన్నారు. తిరుపతి రూరల్ సాయినగర్‌లో గురువారం సర్పంచ్ డీవీ రమణ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయశ్రీ మాట్లాడుతూ శరీరంపై నల్లమచ్చలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. స్క్రబ్ టైఫస్ ఎలా వస్తుందో వివరించారు. వర్షాకాలంలో చిగ్గర్ మైట్(కీటం) ప్రభావం ఎక్కువగా ఉంటుందని, చేతులు, కాళ్లు పూర్తిగా కప్పే దుస్తులను ధరించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణప్రియ, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలు, ఆశాలు పాల్గొన్నారు.

పేరూరు చెరువుకు జలకళ



తిరుపతిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో పేరూరు చెరువుకు నిండుగా నీరు చేరింది. తొండవాడ వద్ద స్వర్ణముఖి నది నుంచి సి.మల్లవరం మీదుగా ఈ చెరువుకు నీరు వచ్చే సప్లైఛానల్స్‌కి పలుచోట్ల అడ్డుగా మొక్కలుండేవి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో స్థానిక టీడీపీ నేతలు వాటిని తొలగించారు. దీంతో వర్షాలకు ఈ కాలువల గుండా సాఫీగా నీరు చెరువుకు చేరింది. అలాగే వాగులు, వంకల మీదుగా చేరిన నీరుతో చెరువు నిండుకుండలా కళకళలాడుతోంది. వర్షాలకు వాగులు, వంకలు పారి మండలంలోని పలు చెరువులు జలకళను సంతరించుకున్నాయి.

క్రీడా పోటీల్లో శ్రీరామ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభచాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జయచంద్ర

తిరుపతిరూరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జేఎన్‌టీయూఏ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు క్రీడా పోటీలలో ప్రతిభచాటి సౌత్‌జోన్, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర పేర్కొన్నారు. విద్యార్థులు కె.సుధీర్‌బాబు జాతీయస్థాయి చెస్ పోటీలకు, పి.మౌనిక సౌత్‌జోన్ స్థాయిలో వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరిని చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవిందకుమార్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

నిండుకుండలా సిద్ధలగండి ప్రాజెక్టు



ఎర్రావారిపాలెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటకాడపల్లె వద్ద తలకోన అడవులకు ఆనుకుని ఉన్న సిద్ధలగండి ప్రాజెక్టు నిండుకుండలా కళకళలాడుతోంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుకు వరద నీరు భారీగా చేరి, మొరవపోతోంది. ప్రాజెక్టు కింద దాదాపు 400 ఎకరాలు సాగవుతోంది. ప్రాజెక్టు చుట్టుపక్కల రెండు మూడు కిలోమీటర్ల వరకు భూగర్భ జలాలకు డోకా ఉండదు.

గుంతలమయంగా అవిలాల రోడ్డు



తిరుపతి(ఎమ్మార్‌పల్లె), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి - బెంగళూరు జాతీయ రహదారి నుంచి అవిలాలకు వెళ్లే మార్గం గుంతలమయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గం గుంతలమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు గాయపడిన ఘటనలు కూడా ఉన్నాయి. దీనిపై గ్రామస్తులు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా దక్షిణామూర్తికి తిరుమంజనం



రామచంద్రాపురం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయల చెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయంలో వెలసిన దక్షిణామూర్తికి గురువారం సుగంధ పరిమళ ద్రవ్యాలతో తిరుమంజనం నిర్వహించారు. ఆలయంలో విశేష పూజల అనంతరం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

'పవన్‌పై విమర్శలు సరికాదు'

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తెలంగాణా మంత్రులు, ఎమ్మెల్యేల విమర్శలు అర్థరహితమని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డీవీ.కృష్ణయాదవ్ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి వారమూ వేలాది మంది పర్యాటకులు గోదావరి జిల్లాల్లో పర్యటిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తుంటారని చెబుతూ సరదాగా పవన్ మాట్లాడిన మాటలను వక్రీకరిస్తూ చేస్తున్న విమర్శలు మానుకోవాలని సూచించారు. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ జేఏసీ నాయకులు హేమాద్రి యాదవ్, గార్లపాటి శ్రీధర్, వెంకటేష్, జ్యోతి ప్రకాష్, మహేంద్ర నాయక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న సూపర్‌వైజర్లు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తాము దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రైల్వే సూపర్‌వైజర్లు కోరారు. ఈ మేరకు గురువారం ఆలిండియా రైల్వే టెక్నికల్ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ నాయకుల పిలుపు మేరకు తిరుపతి రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని కోచింగ్ డిపో ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ సీనియారిటీ మేరకు గ్రూప్-బి హోదా కల్పించాలన్నారు. వీసీవో అలవెన్స్‌లను లెవల్-8 నుంచి రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. నేషనల్ ఆఫ్‌లు, నైట్ డ్యూటీ అలెవన్స్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో లెవల్-8 నుంచి లెవల్-9కి వెళ్లిన వారికి అలెవన్స్ రద్దు చేయరాదని కోరారు.

సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేయండి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గురవయ్య

తిరుపతి(ఆటోనగర్),డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలోని రేణిగుంట పారిశ్రామికవాడలో నిర్మిస్తున్న 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను గురువారం సాయంత్రం సదరన్ డిస్కం టెక్నికల్ డైరెక్టర్ కె.గురవయ్య పరిశీలించారు. తిరుపతి నగరంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగం లోడ్‌ను తగ్గించడం, ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా కోసం ఈ సబ్ స్టేషన్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. 90 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి టౌన్ డివిజన్ ఈఈ సి.గంగాధర్ రెడ్డి, డిప్యూటీ ఈఈలు వి.రమేష్, జయప్రకాష్‌లు, ఏఈ పుణ్యకోటి పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



కామేశ్వరి

తిరుపతి(వైద్యం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థిని డాక్టర్ జి.కామేశ్వరికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్ యూనివర్సిటీ ఫిజియోథెరపీ విభాగంలో కంపారిసన్ ఆఫ్ ది ఎఫికసి ఆఫ్ లో లెవెల్ లేసర్ థెరపి వర్సెస్ అల్ట్రాసౌండ్ థెరపి ఆన్ పెరిక్రేనియన్ మయోఫెషియల్ ట్రిగ్గర్ పాయింట్స్ ఇన్ సబ్జెక్ట్స్ విత్ క్రానిక్ టెన్షన్ హెడ్‌నెక్ అనే అంశంపై పరిశోధనలు నిర్వహించి చీఫ్‌గైడ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకుమారి పర్యవేక్షణలో సమర్పించిన గ్రంథాన్ని యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ వారు పరిశీలించి డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ కామేశ్వరిని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, డీన్ అలోక్‌సచన్‌లు అభినందించారు.

గరుడ వారధిపై నుంచి దూకి గాజుల వ్యాపారి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వివాహమై దాదాపు 30 ఏళ్లు గడిచినా సంతానం లేదనే మానసిక ఆందోళన.. ఆర్థిక సమస్యలతో గురువారం తిరుపతిలోని గరుడ వారధిపై నుంచి దూకి గాజుల వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నట్లు అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపారు. 'రాజస్థాన్‌కు చెందిన కిషోర్‌సింగ్ 50 ఏళ్ల కిందట తిరుపతికి వలసొచ్చాడు. ఆ తర్వాత తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద గాజుల వ్యాపారం పెట్టుకున్నాడు. ఇతడికి పిల్లలు లేరు. మరోవైపు ఆర్థిక సమస్యలు. ఈ క్రమంలో ఇతడి భార్య విద్యాబాయ్ రెండు రోజుల క్రితం అనంతపురం వెళ్లింది. ఈ క్రమంలో కిషోర్‌సింగ్ గరుడ వారధి పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు' అని వివరించారు. అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ అజిత, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని రుయాకు తరలించి.. ఇతడు ఎవరనేది విచారించారు. తిరుచానూరులో గాజుల వ్యాపారిగా గుర్తించారు. మృతుడి తల్లి కాంతిబాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం



గోవిందరాజస్వామి ఆలయంలో కార్తీక దీపాల ఊరేగింపు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని గోవిందరాజస్వామి, కోదండరామ స్వామి ఆలయాల్లో గురువారం పౌర్ణమి సందర్భంగా కార్తీక దీపోత్సవం వైభవంగా జరిగింది. కోదండరామస్వామి ఆలయంలో ఉదయం ఈ దీపోత్సవాన్ని పురస్కరించుకుని అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని పుండరీకవల్లి అమ్మవారి సన్నిధి నుంచి ఆలయ మర్యాదలతో పడి, కార్తీక దీపం, నూతన వస్త్రాలను ఊరేగింపుగా ఇక్కడకు తీసుకొచ్చారు. అనంతరం దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. గోవిందరాజస్వామి ఆలయంలో సాయంత్రం కార్తీక దీపోత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి వారికి ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వి.వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో నాగరత్నం, శాంతి పాల్గొన్నారు.

భూసారాన్ని బట్టి ఎరువులు వాడండి



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామచంద్రాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకుని దాని ఆధారంగా పంట సాగుకు ఎరువులు వాడుకుని నేల ఆరోగ్యాన్ని కాపాడాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని సొరకాయలపాళెం రైతు సేవా కేంద్రంలో గురువారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా ఎరువులు వాడితే సాగు ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. అంతేగాక నేల ఆరోగ్యం కూడా బాగుపడుతుందని తెలిపారు. వ్యవసాయ అధికారిణి మమత మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు తమ పొలాల్లో మట్టిని రైతు సేవా కేంద్రాలకు పంపి భూసార పరీక్ష కార్డులను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కరకంబాడీ రోడ్డంతా జలమయం



నీటిలో ఇబ్బంది పడుతున్న పాదచారులు

తిరుపతి(జీవకోన), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కరకంబాడీ రోడ్డులోని భూపాల్ సింగ్ హౌసింగ్ కాలనీ దగ్గర రోడ్డంతా జలమయంగా మారింది. చిన్నపాటి వర్షం వచ్చినా ఈ మార్గంలో చిత్తడిగా మారిపోతోంది. కాలువలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో రోడ్డుపైకి వరద నీరు చేరుతున్నాయి. చిన్నపాటి చెరువును తలపించేలా ఉండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ అధికారులు ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు.

టీటీడీ విద్యాసంస్థల్లో నైతిక విలువలు నేర్పండి

● అధికారులతో ఈవో సింఘాల్



తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): టీటీడీ విద్యాసంస్థల్లో విద్యార్థులకు విద్యతో పాటు సనాతన ధర్మం, నైతిక విలువలు, భక్తిభావం, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై బోధించాలని ఈవో అనిల్ కుమార్ సింఘాల్ సూచించారు. ఎస్వీ సర్వశ్రేయ.. ఎస్వీ విద్యాదానం.. ప్రాణదానం ట్రస్టులపై గురువారం ఆయన తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో అధికారులతో సమీక్షించారు. విద్యార్థులను తరచూ క్షేత్రస్థాయి పరిశీలనకు తీసుకెళ్తే విజ్ఞానం పెరుగుతుందన్నారు. శ్రవణం ప్రాజెక్ట్ పిల్లలకు శిక్షణ పూర్తయ్యాక వినికిడి యంత్రాలను పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. టీటీడీ ఆస్పత్రుల్లో మందుల కొరత.. ఏయే మందులు అవసరమనేది ఎప్పటికప్పుడు గుర్తించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. తీవ్రమైన కేసులు, ప్రత్యేకమైన కేసులను నయం చేసేందుకు ప్రాణదానం ట్రస్టు నిధులను ఉపయోగించాలన్నారు. తిరుమలలోని పీఏసీ-5లో వైద్య సిబ్బందిని నియమించాలన్నారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, బర్డ్ డైరెక్టర్‌జగదీష్, సీఎంవో కుసుమకుమారి, పద్మావతీ చిన్నపిల్లల ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డీఈవో వెంకట సునీల్ పాల్గొన్నారు.

పాకాలలో కుక్కల స్వైర విహారం



పాకాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాకాల పంచాయతీ పరిధిలోని వీధుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వాహనాల వెంట పరుగులు తీస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. మెయిన్ రోడ్డు, పూరిపేట, భారతంమిట్ట ప్రాంతాల్లో మాంసపు దుకాణాలు ఉండటంతో ఈ ప్రాంతాల్లో కుక్కల సంచారం అధికంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 4 (ఆటోనగర్): తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలోని సౌత్ సెక్షన్‌లో శుక్రవారం విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ సి.గంగాధర్ రెడ్డి తెలిపారు. ఉదయీ ఇంటర్నేషనల్ హోటల్, టీటీడీ రెండవ సత్రం, గాంధీపురం, వెంకటరెడ్డి కాలనీ, వెంకటేశ్వర థియేటర్ ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీజీ సీట్ల భర్తీకి చర్యలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీపీజీ సెట్-2025 కన్వీనర్ కోటాలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కన్వీనర్ కోటాలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసుకోవచ్చంటూ ప్రభుత్వం ఆయా యూనివర్సిటీలకు అనుమతి ఇచ్చింది. దీంతో యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ వంటి పీజీ సీట్లను భర్తీ చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది. ఏపీపీజీసెట్-2025 రాయకపోయినా, అర్హత సాధించకపోయినా వారితోనూ ఈ సీట్లను భర్తీ చేసుకోవచ్చని సూచించింది. అయితే ఈ విధానంలో చేరిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయా యూనివర్సిటీలకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని వల్ల యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పీజీ సీట్లు భర్తీ అయ్యే అవకాశం కనిపిస్తోంది.

రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన అవసరం

● ఏఐసీసీ పరిశీలకురాలు సుధారామకృష్ణన్



సుధారామకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న చిట్టిబాబు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరముందని ఏఐసీసీ పరిశీలకురాలు సుధారామకృష్ణన్ అన్నారు. స్థానిక ఎస్ఎస్ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తిరుపతి జిల్లా, నగర అధ్యక్షుల ఎంపిక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో పాలనా వ్యవస్థ గాడి తప్పుతోందన్నారు. రాష్ట్రంతోపాటు రాజ్యాంగ హక్కులను రక్షించుకోవాలంటే తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ పరిశీలకులు మదన్మోహన్‌రెడ్డి, గడ్డంపాల్ విజయ్ కుమార్, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహార పదార్థాలు అందించండి



అన్నక్యాంటీన్ తనిఖీ చేస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్లలో నాణ్యమైన ఆహార పదార్థాలు అందజేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి ఈఎస్ఐ హాస్పిటల్ సమీపంలోని అన్న క్యాంటీన్లో కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. టోకెన్ల క్రమపద్ధతిలో ఏపూటకాపూట అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తిరుపతి విమానాశ్రయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ హరిప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి

నేటినుంచి వ్యవసాయ వర్సిటీలో క్రీడా సాంస్కృతిక పోటీలు



విలేకరులతో మాట్లాడుతున్న వ్యవసాయ వర్సిటీ డీన్ రామచంద్రరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలో శుక్రవారం నుంచి క్రీడా సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు స్టూడెంట్ అఫైర్స్ డీన్ జి.రామచంద్రరావు తెలిపారు. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీ అనుబంధ కాలేజీల నుంచి 642 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు రవాణా, వసతి, భోజన, వైద్య, భద్రతా సదుపాయాలు కల్పించామన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్వీ వ్యవసాయ కళాశాల డీన్ రెడ్డి శేఖర్, స్టూడెంట్ అఫైర్స్ అధికారి హరిప్రసాద్, మీడియా లైజన్ ఆఫీసర్ గణేష్ పాల్గొన్నారు.

ప్రపంచ భాషలకు సంస్కృతం దిక్సూచి



రంగరామానుజాచార్యులను సత్కరిస్తున్న వర్సిటీ అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ భాషలకు సంస్కృత భాష దిక్సూచి వంటిదని సంస్కృత యూనివర్సిటీ ఆగమ విభాగ అధ్యాపకులు రంగ రామానుజాచార్యులు పేర్కొన్నారు. పద్మావతి డిగ్రీ కాలేజీలో గురువారం చేపట్టిన సంస్కృత భాషా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సకల ధర్మ శాస్త్రాలను బోధించే భాష సంస్కృతమని అభిప్రాయపడ్డారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ మాట్లాడుతూ సంస్కృతం దేవ భాషన్నారు. కాలేజీ తెలుగు, సంస్కృత విభాగాధిపతి కృష్ణవేణి మాట్లాడుతూ వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు వంటి మన దేశ జ్ఞాన సంపదంతా సంస్కృత భాషలోనే ఉందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పవన్‌కు ఎమ్మెల్యే స్వాగతం



తిరుపతి అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పర్యటనకు వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు గురువారం ఉదయం రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వాగతం పలికారు. ఆయన వెంట జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి ఉన్నారు.

డిప్యూటీ సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఆరణి

పవన్‌కు కిరణ్ వీడ్కోలు



తిరుపతి అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు తిరుపతి విమానాశ్రయంలో జనసేన సీనియర్ నేత కిరణ్‌రాయల్ వీడ్కోలు పలికారు. త్వరలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, యాక్టివ్‌గా ఉండాలని పవన్ సూచించినట్లు కిరణ్‌రాయల్ చెప్పారు.

డిప్యూటీ సీఎంకు వీడ్కోలు పలుకుతున్న కిరణ్‌రాయల్

న్యాయం చేయండి

- డిప్యూటీ సీఎంకు దామినేడు వాసుల వినతి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలని తిరుపతి రూరల్ మండలం దామినేడు వాసులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కోరారు. చిత్తూరు పర్యటన ముగించుకుని గురువారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయానికి వెళుతున్న పవన్ దామినేడు వద్ద జోరు వర్షంలో తడుస్తూ తనకోసం వేచి ఉన్న రైతులను చూసి కాన్వాయ్ ఆపారు. తాము ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం కోర్టు కాంప్లెక్సుకు కేటాయించిందని, తద్వారా తాము ఉపాధి కోల్పోతామని విన్నవించుకున్నారు. న్యాయం చేయాలని కోరారు. చర్చించి న్యాయం చేస్తామని పవన్ వారికి హామీ ఇచ్చారు.

ఘనంగా ఘంటసాల జయంతి



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న పబ్లిక్ రిలేషన్ సొసైటీ సభ్యులు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. రాయలసీమ రంగస్థలి కళాకళాకారుల ఆధ్వర్యంలో వీవీమహల్ రోడ్డులోని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాకారుడు పద్మనాభాన్ని ఘంటసాల జ్ఞాపికతో సత్కరించారు. పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

తిరుమల డంపింగ్ యార్డును శుభ్రం చేయాలి



తిరుమల డంపింగ్ యార్డు చిత్రాలను ప్రదర్శిస్తున్న కిరణ్

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : తిరుమలలో డంపింగ్ యార్డును శుభ్రం చేయాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు కిరణ్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు కిలోమీటరుకుపైగా విస్తరించి వ్యర్థాలు కొండల్లా పేరుకుపోయాయని, ఈ విషయమై టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ డంపింగ్ యార్డు వ్యర్థాల నుంచి కలుషిత నీరు ప్రవహిస్తోందన్నారు. తద్వారా కొండకోనల్లోని వనమూలికలు నశించిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు డంపింగ్ యార్డు చిత్రాలను ప్రదర్శించారు. తిరుమల స్థానికులు కోలాముని దామోదరం, బాలాజీ, విజయ్, నిర్మలమ్మ, సావిత్రమ్మ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని తీసేస్తామన్న వ్యాఖ్యలు బాధాకరం

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తీసేస్తామనే బీజేపీ నాయకుల వ్యాఖ్యలు బాధాకరమని, ఇందుకు నిరసనగా జనవరి 26వ తేదీన గవర్నర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దళితుల వ్యతిరేకిగా పేర్కొన్నారు. దళితులను అణచివేయడమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఆదాని, అంబానీ వంటి కార్పొరేటర్ల చేతుల్లో కీలుబొమ్మగా మారిన ప్రధాని మోదీ తీసుకుంటున్న నిర్ణయాలు దేశాన్ని అధోగతి పాలు చేస్తున్నాయన్నారు. దీనినుంచి బయటపడాలనుకుంటే గవర్నర్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రాజు, దళిత బహుజన పార్టీ రాష్ట్ర నాయకులు నాగరాజు, నక్కా గురవయ్య, ఎస్.లోకేశ్వరి, తలారి బత్తెయ్య, వెంకటముని పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



కళ్యాణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ ఫార్మసీ పరిశోధకురాలు కె.కళ్యాణి డాక్టరేట్ పొందారు. డెవలప్‌మెంట్ ఆఫ్ క్వాలిటేటివ్ అండ్ క్వాంటేటివ్ అనలిటికల్ మెథడ్స్ ఫర్ సమ్ ఫైటోకెమికల్ మార్కర్స్ అంశంపై ప్రొఫెసర్ అనురాధ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

అంధబాలుడి సాహసం

8న నాన్‌స్టాప్ 200 కిలోమీటర్ల బ్లైండ్ మల్టీటాస్క్ రోడ్డు స్కేటింగ్ మారథాన్



హర్షవర్ధన్‌ను, కోచ్ ప్రతాప్‌ను అభినందిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక తీర్థకట్ట వీధికి చెందిన అంధ బాలుడు హర్షవర్ధన్ మరో సాహసానికి సిద్ధమవుతున్నాడు. ఈనెల 8వ తేదీన నాన్‌స్టాప్ 200 కిలోమీటర్ల బ్లైండ్ మల్టీటాస్క్ రోడ్డు స్కేటింగ్ మారథాన్‌లో పాల్గొని ప్రపంచ రికార్డు కోసం ప్రయత్నిస్తున్నాడు.

రూట్‌మ్యాప్ ఇలా..: రాష్ట్ర సరిహద్దు నంగిలి చెక్ పోస్టు నుంచి పలమనేరు, చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి మీదుగా పుత్తూరుకు చేరుకుంటారు. వజ్ర, వండర్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డుల ప్రతినిధులు హాజరై రికార్డు చేస్తారు. 9న స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో ప్రపంచ రికార్డు పత్రాన్ని అందిస్తారు.

శాప్ చైర్మన్ సహకారం..: హర్షవర్ధన్ గురువారం తన కోచ్ ప్రతాప్‌తో కలిసి శాప్ చైర్మన్ రవినాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్కేటింగ్ చేసే రూట్‌మ్యాప్‌ను చూపించి సహాయ సహకారాలు కోరారు. స్పందించిన రవినాయుడు ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని, సమస్యలు తలెత్తకుండా చూడాలని రెండు జిల్లాల డీఎస్‌డీవోలను ఫోన్ ద్వారా ఆదేశించారు. రోడ్డు భద్రత కల్పించాలని పోలీసు విభాగాన్ని కోరి, అవసరమైన అనుమతులు ఇప్పించారు. తనవంతు సాయంగా రూ.10వేలు అందించారు.

సంస్కృతాన్ని శాస్త్రీయ జ్ఞానంతో అనుసంధానిస్తాం

- సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంస్కృత భాషా సాహిత్యాన్ని శాస్త్రీయ విజ్ఞానంతో అనుసంధానిస్తామని సంస్కృత యూనివర్సిటీ వీసీ కృష్ణమూర్తి పేర్కొన్నారు. భారతీయ భాషల ఏకరీతి శాస్త్రీయ, సాంకేతిక పరిభాషలపై రెండు రోజుల జాతీయ కార్యశాలను గురువారం ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. భాషాపరమైన పరిశోధనల్లో సంస్కృత యూనివర్సిటీ గొప్ప ప్రగతిని సాధించిందన్నారు. విషయ నిపుణులు జనార్దన హెగ్డే మాట్లాడుతూ సంస్కృత భాషకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. భారతీయ భాషా సమితి ప్రతినిధి గిరిధరరావు మాట్లాడుతూ భారతీయ భాషలన్నింటిలో ఏకరూపత ఉంటుందన్నారు. అయితే, వీటిని సాంకేతీకరించాల్సిన అవసరం ఉందన్నారు.

కీలక పోస్టులు ఖాళీగా ఉండటం వల్లే టీటీడీలో అవినీతి: నవీన్



తిరుపతి(జీవకోన), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీటీడీలో కీలక పోస్టులు ఖాళీగా ఉండటమే అవినీతికి కారణమవుతోందని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. మార్కెటింగ్, ఇంజనీరింగ్, లా డిపార్ట్‌మెంట్, వెల్ఫేర్, క్యాటరింగ్ వంటి కీలకమైన విభాగాలపై ధర్మకర్తలమండలి, ఈవో దృష్టి సారించి రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలని కోరారు. టీటీడీలో సమాచార హక్కు చట్టాన్ని తీసుకురావాలని పేర్కొన్నారు. నిఘా సంస్థల రంగ ప్రవేశంతో అవినీతి కేసులు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయని, ఇలాంటివి పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని కోరారు.

శాస్త్రోక్తంగా చండీహోమం



హోమపూజల్లో పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గురువారం చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ హోమ పూజలకు ముందు అమ్మవారి ఉత్సవమూర్తికి సర్వాలంకారాలు చేసి కొలువుదీర్చారు. కలశ స్థాపన చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం చేశారు. అనంతరం దుర్గాసప్తపదిలోని శ్లోకాలను పారాయణం చేస్తూ అత్యంత వేడుకగా చండీ హోమ పూజలు చేశారు. చివరిగా పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ చైర్మన్ నైనారు మహేష్ యాదవ్, ఈవో ఏ.జయకుమార్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో శనివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ నిర్వహిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

గురజాడ స్మారక భవనాన్ని సుందరీకరించాలి

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : విజయనగరంలోని మహాకవి గురజాడ అప్పారావు స్మారక భవనాన్ని సుందరీకరించాలని తిరుపతి జిల్లా సాహిత్య సంస్థల ప్రతినిధులు గురువారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. ఈ స్మారక భవనం చుట్టూ బహిరంగ మూత్రవిసర్జనతో దుర్గంధపూరితమైన వాతావరణం నెలకొందన్నారు. అన్యాక్రాంతమవుతున్న స్థలాన్ని కాపాడి సుందరీకరించాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో సాహితీ సంస్థల ప్రతినిధులు యువశ్రీ మురళి, మన్నవ గంగాధర ప్రసాద్, రామచంద్రారెడ్డి, తోట వెంకటేశ్వర్లు, గార్లపాటి దామోదరం నాయుడు, శైలకుమార్, మస్తానమ్మ, సాకం నాగరాజు ఉన్నారు.

పవన్‌కల్యాణ్‌కు స్విమ్స్ ఉద్యోగుల వినతి

తిరుపతి(వైద్యం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ ఉద్యోగాల నోటిఫికేషన్‌లో అవుట్‌సోర్సింగ్ కింద పనిచేసే వారికి అవకాశం కల్పించి, రెగ్యులర్ చేయాలని కోరుతూ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు స్విమ్స్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి వినతిపత్రం అందజేశారు. చిత్తూరు జిల్లా పర్యటన నిమిత్తం వచ్చిన ఆయన్ను గురువారం స్విమ్స్ ఉద్యోగ సంఘం నేతలు కలిసి సమస్యలకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. స్విమ్స్‌లోని పలు విభాగాల పరిధిలో 304 రెగ్యులర్ పోస్టుల నియామకానికి టీటీడీ ఇటీవల ఆమోదించడం సంతోషకరమైనా తద్వారా అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కింద పనిచేసే ఉద్యోగులకు కొంత అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా సూపర్ న్యూమరరీ సర్వీస్ కింద ఇన్ సర్వీస్ ద్వారా కేవలం ఇంటర్వ్యూలు నిర్వహించి, డైరెక్ట్ రెగ్యులర్ చేయడానికి అనుమతులు ఇస్తే స్విమ్స్‌లో ఎన్నో ఏళ్లుగా పనిచేసే వారికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

అంబేడ్కర్ వర్ధంతికి రండి : ఎస్వీయూ రిజిస్ట్రార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా యూనివర్సిటీ మెయిన్‌గేట్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి ఘన నివాళి అర్పిద్దాం రండి అని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు కోరారు. యూనివర్సిటీలోని అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులందరూ 6వ తేదీ ఉదయం 10.30 గంటలకు అంబేడ్కర్ విగ్రహం వద్దకు రావాలని కోరారు.

రుయాలో అరుదైన శస్త్ర చికిత్స




కోలుకున్న బాలుడితో వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం),డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల బాలుడు మింగిన ప్లాస్టిక్ క్యాప్ ఊపిరితిత్తుల్లో ఇరుక్కుపోవడంతో శస్త్ర చికిత్స చేసి తొలగించినట్లు రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ అన్నారు. గురువారం ఆమె మీడియాకు ఆ వివరాలు తెలియజేశారు. కడప జిల్లా పులివెందుల మండలం రాజీవ్‌కాలనీకి చెందిన పాలెం ప్రశాంత్ కుమారుడు(3) నాలుగు రోజుల క్రితం ఆడుకుంటూ ప్లాస్టిక్ బాటిల్ క్యాప్‌ను మింగేశాడు. అది ఊపిరితిత్తుల్లో ఇరుక్కుపోవడంతో బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించి రుయాస్పత్రికి తీసుకువచ్చారు. పిడియాట్రిక్ సర్జరీ విభాగం వైద్యుడు ఏ.బీ.జగదీష్ పరీక్షించి ఊపిరితిత్తుల్లో ప్లాస్టిక్ క్యాప్ ఉన్నట్లు గుర్తించి వైద్య బృందంతో కలిసి అత్యంత క్లిష్టమైన బ్రోంకోస్కోపీ సర్జరీ చేసి తొలగించారు. బాలుడు కోలుకోవడంతో గురువారం డిశ్చార్జి చేశారు. బాలుడిప్రాణాలు నిలబెట్టడంతో బాలుడి తల్లిదండ్రులు రుయా వైద్యులకు ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవి ప్రభు, ఏఆర్‌ఎంవో హరికృష్ణ, పల్మనాలజీ విభాగాధిపతి సుబ్బారావు పాల్గొన్నారు.



చిత్తూరు డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన చిత్తూరుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్‌ను కలిసిన జనసేన తిరుపతి నేత డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు





మాలాడిగుండం



కపిలతీర్థం



తలకోన



మొండోడి కోన



మంగళం

జలపాతాల పరవళ్లు

తిరుపతి నగరానికి పచ్చని కిరీటంలా కనిపిస్తుంది తిరుమల కొండ. పాతిక కిలోమీటర్ల దూరం నుంచి కూడా పవళించిన అనంత శేషుడిలా కనిపించే ఈ కొండల బారు రుతువు రుతువుకీ తన అందాలు మార్చుకుంటుంది. ఎండాలకాలం మొక్కలు మోడులై తెల్లని బండలు మెరుస్తూ దర్శనమిస్తుంది. వాన కురిస్తే పరచకుకున్న ఆకుపచ్చదనం కనువిందు చేస్తుంది. ఎడతెగని తుఫాను వానలతో కొండల్లోంచి జాలువారుతున్న వాగులు వంకలతో, దూకుతున్న జలపాతాలతో శేషాచలం సౌందర్యవనంగా మారింది. కరకంబాడి నుంచి తలకోన దాకా కొండబారున ఎటు చూసినా పచ్చని అడవిలోంచి తెల్లని పాలనురగలా జారుతున్న జలపాతాలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాల నుంచి కనిపించే అందాలే. కొండలు ఎక్కి లోయల్లోకి దిగితే అనేక తీర్థాలు స్వాగతం పలుకుతాయి.



బీటీఆర్ కాలనీ

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, తిరుపతి

జలపాతాల జీవకోన

తిరుపతి(జీవకోన),(అర్బన్)డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని జీవకోనలో వెలసిన జీవలింగేశ్వరస్వామి జలపాతం కనువిందు చేస్తోంది. ఆలయం ఆనుకుని ఉన్న ఎత్తైన కొండ నుంచి జాలువారుతున్న ఈ జలపాతం లో భక్తులు పెద్ద సంఖ్యలో స్నానాలు చేస్తున్నారు. మంగళంలోని బీటీఆర్ కాలనీకి ఆనుకొని ఉన్న అటవీప్రాంతంలో కూడా కొండల నుంచి వచ్చే నీరు జోరుగా దూకుతున్నాయి. సమీప ప్రజలు ఆ ప్రాంతానికి చేరుకొని స్నానమాచరిస్తున్నారు. ఈ జలధారలు కాస్త దూరం ప్రవహించి ఆ తరువాత మాయమైపోయి, భూ అంతర్భాగంలో ప్రవహిస్తూ కొండకిందన మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇళ్లమధ్య కాలువల్లో దూసుకెళ్తూ చెన్నాయిగుంట చెరువులో కలుస్తోంది. అలాగే జీవలింగేశ్వరస్వామి ఆలయం నుంచి తూర్పు దిక్కున 300మీటర్లు వెళితే మొండోడికోన దర్శనమిస్తుంది. ఈ ప్రాంతం ప్రస్తుతం జల సవ్వడితో సందడి చేస్తోంది. కొండగుట్టల్లో చెట్ల మధ్యలో నుంచి జలపాతం దర్శనమిస్తోంది. స్థానికులు వీటిని సందర్శించి జలకాలాడుతున్నారు. ఆ నీరు దిగువ భవనాల మధ్య నుంచి ప్రవహిస్తూ మంగళం చెరువులోకి చేరుతోంది. లీలామహల్ సర్కిల్ నుంచి కరకంబాడి దాకా ఉత్తరపు దిక్కున కొండల్లోంచి అనేక తావుల్లో పాలధారల్లాంటి జలధారలు కనిపిస్తున్నాయి. వానలు కురిసినపుడు మాత్రమే ఇవి కనిపిస్తుంటాయి.



జీవలింగేశ్వర స్వామి ఆలయం



అబ్బురపరిచే పెంచలకోన జలపాతం

వెంకటగిరి నియోజకవర్గం.. నెల్లూరు జిల్లా పరిధిలోని రాపూరు మండలం పెంచలకోన పరవళ్లు తొక్కుతోంది. 500 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు నుంచి స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో కిందికి దూకుతోంది.

- రాపూరు, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో ప్రముఖులు



అశ్విన్, తమన్, ఓంకార్

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ మంత్రి బాలవీరాంజనేయ స్వామి, ఆర్మీ ఏపీ, తెలంగాణ సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్(జీవోసీ) మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, ఇంటర్ విద్య డైరెక్టర్, కార్యదర్శి నారాయణ భరత్ గుప్తా, సినీ సంగీత దర్శకుడు తమన్, నటుడు అశ్విన్, నిర్మాత ఓంకార్ ఉన్నారు.

నిండుగా తిరుమల జలాశయాలు

- 2026 డిసెంబరు 15 దాకా సరిపడేంత నిల్వలు

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో తిరుమలలోని జలాశయాలు నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం నీటి నిల్వలను బట్టీ 2026 డిసెంబరు 15 వరకు తిరుమల అవసరాలకు సరిపడా నీరు ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.దాదాపు ఐదేళ్ల తర్వాత ఈస్థాయిలో డ్యాములు నిండటం ఇదే. ఇలానే మరో ఐదురోజులపాటు వర్షం కురిస్తే 2027 జనవరి వరకు సరిపడేన్ని నీళ్లు నిల్వచేయచ్చని భావిస్తున్నారు. వారం నుంచి తుఫాన్ ప్రభావంతో అడవుల్లో నుంచి పిల్ల కాలువల ద్వారా నీరు డ్యాముల్లో చేరుతోంది. ప్రస్తుతం పాపవినాశనం డ్యాం నుంచి మూడు ఇంచులు, గోగర్భ నుంచి రెండు ఇంచుల నీటిని దిగువకు వదులుతున్నారు.

నిండుతున్న మల్లిమడుగు

తిరుమలలోని మూడు డ్యాముల నుంచి నీరు ఓవర్‌ఫ్లో కావడంతో రెండు డ్యాముల గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.గోగర్భం డ్యాం నుంచి దిగువకు వెళుతున్న నీరు అవ్వాచారి కోనలోయ నుంచి 35 నుంచి 40 కిలోమీటర్ల దూరంలోని మల్లిమడుగు డ్యాంకు చేరుతున్నాయి. అలాగే ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార, పసుపుధార డ్యాముల నుంచి వెళుతున్న నీరు తుంబరకోనకు చేరి అక్కడి నుంచి మల్లిమడుగు డ్యాంకు ప్రవహిస్తున్నాయి.

తిరుమలలో ప్రదేశాల పేర్లు మార్చనున్న టీటీడీ

- సీఎం నుంచీ సానుకూల స్పందన

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) మరింత ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా తిరుమలలోని ప్రదేశాలు, రోడ్లు, వసతి సముదాయాల పేర్లను మార్చాలని టీటీడీ ఆలోచిస్తోంది. తిరుమల క్షేత్రం వైభవానికి కారకులైన ఆళ్వారులు, అన్నమయ్య, పురందరదాసు వంటి వాగ్గేయకారులు పేర్లను పెట్టాలని అనుకుంటున్నారు. ఇందుకోసం దాదాపు 50 పేర్లను ఇప్పటికే సిద్ధం చేశారు. తిరుమలలో అనేక వసతి సముదాయాలను ఇప్పటికీ ఏటీసీ, ఎంబీసీ, ఏటీజీహెచ్, హెచ్‌వీసీ, ఎస్వీజీహెచ్ వంటి పేర్లతో పిలుస్తున్నారు. వీటికి ప్రసిద్ధుల పేర్లు పెట్టనున్నారు. మల్లంగుంట, మేదరమిట్ట అనే పేర్ల స్థానంలో కొత్త పేర్లు పెడతారు. అలాగే కొన్ని కూడళ్లు, రోడ్లుకు కూడా ఆధ్యాత్మికవేత్తల పేర్లను పెట్టాలని భావిస్తున్నారు. ఈ పేర్ల వల్ల తిరుమలను సందర్శించే భక్తులు వారి చరిత్రను కూడా తెలుసుకుంటారని టీటీడీ భావిస్తోంది. పేర్ల మార్పు అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలుస్తోంది.



కార్తీక పౌర్ణమి దీపోత్సవం

తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం సాయంత్రం కార్తీక పౌర్ణమి దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. మొదట యోగనరసింహస్వామి ఆలయం పక్కనే ఉన్న పరిమళం అర వద్ద కొత్త మూకుళ్లలో దీపాలను వెలగించారు. ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇచ్చారు. గర్భాలయంలో అఖండం, కులశేఖర పడి, రాములవారిమేడ, ద్వార పాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళ మాత, బంగారుబావి, కళ్యాణమండపం, సభ అర, తాళ్లపాక అర, భాష్యకారుల సన్నిధి, యోగ నరసింహ స్వామి, విష్వక్సేనులు, చందనం అర, పరిమళం అర, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలకుల సన్నిధి, తిరుమలరాయమండపం, పూలబావి, రంగనాయకమండపం, మహద్వారం, బేడిఆంజనేయస్వామి, వరాహస్వామిఆలయం, పుష్కరిణి వద్ద సుమారు వెయ్యి నేతి జ్యోతులను వెలిగించారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



దళిత వ్యతిరేకి ఆదిమూలం: టీడీపీ

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దళిత వ్యతిరేకి అని ఆ నియోజకవర్గ టీడీపీ దళిత నాయకులు ఆరోపించారు. దళిత ఎమ్మెల్యే అని చెప్పుకుంటూ దళితులపైనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడి అక్రమ కేసులు బనాయించారని ధ్వజమెత్తారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. వైసీపీలో ఉంటూ టీడీపీలోకి వచ్చిన వెంటనే అధిష్ఠానం టికెట్ ఇచ్చిందని, తాము ఆయన గెలుపు కోసం శ్రమించామన్నారు. ఆయన చేసిన తప్పులతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. నాయకులు, కార్యకర్తల కోసం శంకర్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే ఆదిమూలం పెత్తందారీ పెత్తనం అంటూ ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కులమతాలకు అతీతంగా శంకర్‌రెడ్డి పనిచేస్తూ దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని చెప్పారు. వైసీపీ నుంచి వచ్చిన ఆదిమూలం ఇప్పటికీ ఆ పార్టీ వారికే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ పారి చందన స్రవంతి, నాయకులు బి.జ్ఞానకుమార్, నెల్సన్ మండేలా, శ్రీనివాసులు, ధనశేఖర్, రమేష్, దశరదన్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి డివిజన్ డిమాండ్



రైల్వే మంత్రి అశ్విన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాధనసమితి నాయకులు, ఏపీ ఎంపీలు

తిరుపతి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు డిమాండ్‌ను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ దృష్టికి సాధన సమితి సభ్యులు తీసుకెళ్లారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పార్లమెంట్ టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు కృష్ణదేవరాయలు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌తో కలిసి గురువారం పార్లమెంట్‌లోని కేంద్ర మంత్రి ఛాంబర్‌లో వినతి పత్రం అందజేశారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, లావు కృష్ణదేవరాయలు బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను రైల్వే మంత్రికి వివరించారు. 30 ఏళ్లుగా నెలకొన్న డిమాండ్‌ను పరిష్కరించాలని కోరారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి న్యాయ సముచితంగా అదనపు రైల్వే డివిజన్ ఏర్పాటు అవసరమన్నారు. యాత్రికుల తాకిడి పెరిగిన దృష్ట్యా తిరుచానూరు, రేణిగుంట,చంద్రగిరి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని కోరారు. హైదరాబాద్ నుంచి గూడూరు వరకు వచ్చే సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను రేణిగుంట వరకు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, సభ్యులు ఎమ్.వేణుగోపాల్ రెడ్డి, పీసీ రాయల్, కేవీ చౌదరి, సూరినేని బుజ్జి బాబు నాయుడు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆలస్యంగా విమానాల రాకపోకలు

రేణిగుంట డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలించక పలు విమానాలు ఆలస్యంగా నడిచాయి. గురువారం ఉదయం హైదరాబాదు నుంచి వచ్చిన ఇండిగో విమానం తప్ప మిగిలినవన్నీ గంట నుంచి రెండు గంటలు వరకు ఆలస్యంగా రాకపోకలు సాగించాయి.

26 నుంచి విద్యాపీఠంలో భారతీయ విజ్ఞాన సమ్మేళనం

- సీఎం, డిప్యూటీ సీఎం, ఆర్ఎస్ఎస్ చీఫ్ రాక
- 29న ముగింపు రోజు ప్రధాని హాజరయ్యే అవకాశం

తిరుపతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విద్యా పీఠంలో ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు భారతీయ విజ్ఞాన సమ్మేళనం జరగనుంది. ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగమైన విజ్ఞాన భారతి సంస్థ చేపట్టే ఈ కార్యక్రమం తొలిరోజు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు హాజరు కానున్నట్టు సమాచారం. ముగింపు వేడుకలకు ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశముంది. ఇప్పటి వరకూ దేశవ్యాప్తంగా వేర్వేరు నగరాల్లో ఆరు సమ్మేళనాలు జరగగా ఏడవ సమ్మేళనం తిరుపతిలో జరిపేందుకు నిర్వాహకులు నిర్ణయించి ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నైపుణ్యాల పెంపునకు పరిశ్రమలతో భాగస్వామ్యం

- వెటర్నరీ పీజీవిద్యార్థుల జాతీయ సదస్సులో డాక్టర్ ప్రకాశరావు



సదస్సు సావనీర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

తిరుపతిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధి, ఉద్యోగ నైపుణ్యాలను పెంచేందుకు పరిశ్రమలతో భాగస్వామ్యం ఎంతో అవసరమని చెన్నైకి చెందిన ప్రకాశ్ ఫుడ్స్ అండ్ ఫీడ్‌మిల్స్ సంస్థ చైర్మన్ డాక్టర్ డీవీఆర్ ప్రకాశ్‌రావు పేర్కొన్నారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల వేదికగా గురువారం 'ఇంపాక్ట్ ఆఫ్ వెటర్నరీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్స్ ఆన్ యానిమల్ హెల్త్ అండ్ ప్రొడక్టివిటీ' అంశంపై నిర్వహించిన జాతీయసదస్సులో ఆయన మాట్లాడారు. కాలానుగుణంగా మల్టీ డిసిప్లినరీ పరిశోధనలు రూపొందించాలన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరిశోధనలు రూపొందించడంపై పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు దృష్టిసారించాలని తెలిపారు. గౌరవఅతిధిగా హాజరైన విశాఖకి చెందిన ఆంకో సీక్ బయో సంస్థ చైర్మన్ డాక్టర్ పూసల సురేష్ మాట్లాడుతూ.. శాస్త్రీయ పరిశోధనల పురోగతికి ప్రయోగశాల, జంతువుల పాత్రని వివరిస్తూ..నాణ్యమైన పరిశోధనలు ఆవిష్కరించాలన్నారు. జీవోటీస్‌సంస్థ చైర్మన్ డాక్టర్ కిశోర్ ప్రయాగ, వర్సిటీ డీఆర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, వెటర్నరీసైన్స్ డీన్ డాక్టర్ ఆర్వీ సురేష్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య మాట్లాడారు. ప్రొఫెసర్ డాక్టర్ బి.రాంబాబునాయక్, కోఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ కె.సుధీర్, డాక్టర్ వై.మురళీధర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ రాజ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో నేడు డయల్ యువర్ ఈవో

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరగనుంది. భక్తులు తమ సందేహాలు, సలహాలు, ఫిర్యాదులపై 0877 2263261 నెంబరును ఫోనుచేసి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో మాట్లాడొచ్చు.

23, 29 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాల రద్దు

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో డిసెంబరు 23న జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి), వైకుంఠ ఏకాదశి ముందురోజు 29వ తేది వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్టు టీటీడీ గురువారం ప్రకటించింది. వైకుంఠ ద్వార దర్శనాలు జరిగే పదిరోజుల పాటు స్వయంగా వచ్చే ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు వీఐపీ బ్రేక్‌ను పరిమితం చేసి సిఫార్సు లేఖలపై ఇచ్చే బ్రేక్ దర్శనాలను చేస్తున్నట్టు టీటీడీ ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే.

బహుమతి పేరిట మోసం

- రూ.3.5 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

తిరుపతి(నేరగాళ్ళు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బహుమతి పేరు చెప్పారు. వివరాలన్నీ తెలుసుకుని ఆ వ్యాపారి ఖాతాలో రూ.3.5 లక్షలు లాగేసుకున్నారు సైబర్ నేరగాళ్లు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతిలోని ఓ వ్యాపారికి వారం కిందట గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. ఢిల్లీ నుంచి మాట్లాడుతున్నామని, మీరు ఆన్‌లైన్ ద్వారా ఇటీవల టీవీ కొన్నారు కదా? మేము తీసిన లక్కీ డ్రాలో మీకు ద్విచక్ర వాహనం బహుమతిగా వచ్చిందని చెప్పాడు. ఒకవేళ బహుమతి వద్దనుకుంటే, దానికి సరిపడా డబ్బును రెట్టింపుగా మీ అకౌంటులో జమ చేస్తామని నమ్మపలికారు. దానికోసం అకౌంటు నెంబరు, ఐఎఫ్ఎస్సీ కోడ్, ఆధార్ నెంబరు తదితర వివరాలు అడిగాడు. దీనిని నమ్మిన ఆ వ్యాపారి వాళ్లు అడిగిన వివరాలన్నీ చెప్పారు. ఆ తర్వాత మీకు అకౌంటులో డబ్బులు పడాలంటే ముందుగా మీరు కొంత నగదు చెల్లించాలని చెప్పాడా వ్యక్తి. దీంతో తన అకౌంటు నుంచి 10,000 పంపారు. ఆ తర్వాత వ్యాపారి అకౌంటులో ఉన్న దాదాపు రూ 3.45 లక్షలు కొట్టేశాడా సైబర్ నేరగాడు. మొబైల్‌కు వచ్చిన మెసేజ్ చూసి అవాక్కయిన వ్యాపారి లబోదిబోమంటున్నారు. ఈ విషయం ఎవరికైనా తెలిస్తే అవమానమని మిన్నకుండిపోయారు. పోలీసులకూ ఫిర్యాదు చేయలేదు.

ఎంఎస్ఎంఈ పరిశ్రమలతో యువతకు మెరుగైన ఉపాధి

- సీఐఐ పార్టనర్ సమ్మిట్‌లో జిల్లాకు 61మందితో ఎంవోయూ కుదిరిందన్న కలెక్టర్



తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జరిగిన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు రాష్ట్రప్రభుత్వంతో 61మంది ఎంవోయూ కుదుర్చుకున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో సీఐఐ భాగస్వామ్య సదస్సు పెట్టుబడిదారుల సమావేశం, జిల్లా పరిశ్రమయల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనతో యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా పరిశ్రమలశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. సింగిల్ డెస్క్ విధానం ద్వారా అక్టోబరు నుంచి 1,821 పరిశ్రమలకుగాను 1,755 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని మరో 56 పరిశీలనలో ఉన్నాయన్నారు. ఇక 13 పరిశ్రమలకు ప్రోత్సాహకాలకు రూ.77.45లక్షలు అందించడానికి పరిశీలన కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో పెట్టుబడిదారులు, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజరు చంద్రశేఖర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్ రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

అందరి మద్దతుతో గూడూరు ఉద్యమం

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజలందరి మద్దతుతో ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళుతామని గూడూరు జేఏసీ కన్వీనర్ దశరధరామిరెడ్డి అన్నారు. రోటరీభవన్‌లో గురువారం జరిగిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయడమో, లేక ప్రత్యేక జిల్లాగానో ప్రకటించాలన్నారు. ఏదో ఒక నిర్ణయం తీసుకునే వరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. వివిధ పార్టీలు, కార్మిక సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రజాసంఘాలను కలుపుకుని శాంతియుత పోరాటాన్ని సాగిస్తూ ఇచ్చిన హామీని సాధించుకునేంత వరకు ముందుకు వెళుతామన్నారు. జేఏసీ కార్యదర్శిగా చిరువెళ్ల సునీల్‌కుమార్, కోశాధికారులుగా నిరంజన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జమాలుల్లా, జాయింట్ సెక్రటరీగా నాగేశ్వరరావు, సభ్యులను ఎన్నుకున్నారు. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

17 లక్షల మంది శ్రీవారి సేవకులు

- త్వరలో టీటీడీ స్థానికాలయాల్లోనూ శ్రీవారి సేవ : ఈవో

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): 2000 సంవత్సరంలో 200 మంది సేవకులతో ప్రారంభమైన శ్రీవారిసేవ ప్రస్తుతం 17 లక్షల మందికి చేరుకున్నదని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ చెప్పారు. శ్రీవారిసేవాగ్రూప్ సూపర్వైజర్లకు తిరుమలలో నిర్వహిస్తున్న 'ట్రైన్ ది ట్రైనర్స్' కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడుతూ, హిందూ ధర్మప్రచారంలో మరింత సేవలు అందించేలా వీరికి శిక్షణ ఇస్తున్నామన్నారు. తమ ప్రాంతాల్లోని ఆలయాల్లో కూడా శ్రీవారిసేవ చేసేందుకు సేవకులు ముందు రావాల్సిన అవసరముందన్నారు.

కూలిన చెట్టు.. తప్పిన ముప్పు



శ్రీకాళహస్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రధాన ద్వారం పక్కనే ఉన్న భారీ వృక్షం నేలకూలింది. ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదుట నిత్యం ఆటోలు, అంబులెన్సులు నిలిపి ఉంచుతారు. ఓపీ సమయంలో ఈ ద్వారం నుంచి పెద్దసంఖ్యలో రోగులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వేకువజామున చెట్టు నేలకూలడంతో ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అటవీశాఖ అధికారులు చెట్టును తొలగించారు.

విద్యుత్ ఉపకేంద్రాల్లోకి వర్షపునీరు



పానగల్ ఉపకేంద్రం వద్ద ఉన్న వర్షపునీరు

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని విద్యుత్ ఉప కేంద్రాల్లోకి భారీగా వర్షపునీరుచేరింది. పట్టణంలోని ప్రధాన విద్యుత్ కార్యాలయం వద్ద నీరు స్తంభించింది. మెయిన్ ఫీడర్, ఇండస్ట్రియల్ ఫీడర్, ఇదే ప్రాంగణంలోని ఉపకేంద్రాల్లో నీరు నిలిచిపోయింది. అధికారులు మోటార్ల ద్వారా నీటిని బయటకు తరలిస్తూ విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలుచేపట్టారు. ఇదే తరహాలో పట్టణంలోని దక్షిణకైలాస్ నగర్‌కాలనీ, పానగల్‌ప్రాంతంలో ఉన్న ఉపకేంద్రాల్లో సైతం వర్షపు నీరు స్తంభించింది.

మార్గశిర పౌర్ణమి దీపోత్సవం

కేవీబీపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొలువైన ముత్తుమారియమ్మ ఆలయం వద్ద మార్గశిర పౌర్ణమి సందర్భంగా ఆలయ ధర్మకర్త నారాయణ ఆధ్వర్యంలో 101 దీపాలను వెలిగించి దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ ధర్మకర్త తీర్థప్రసాదాలు అందజేశారు.

చంద్రన్న పాలనలోనే భక్తులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భక్తుల సంతృప్తి చంద్రన్న పాలనలోనే సాధ్యమని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని ప్రముఖ దేవాలయాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, దర్శన ఏర్పాట్లు తదితర అంశాలపై భక్తుల నుంచి వ్యక్తమైన అభిప్రాయాల ప్రకారం శ్రీకాళహస్తీశ్వరాలయం 72.7శాతంతో మొదటి స్థానంలో నిలవడం గర్వ కారణమన్నారు. అధికార యంత్రాంగం పనితీరు అభినందనీయ మన్నారు. అలాగే ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు భీమాల భాస్కర్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, మురళీనాయుడు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు



నాగలాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ భూములు టీటీడీకి చెందినవని తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నాగలాపురం వీకేఎం వీధి వాసులు కోరారు. ఈ మేరకు గురువారం ఎస్‌ఐ సునీల్‌కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సన్నిధి వీధిలో గ్రామీణ బ్యాంకు వెనుక ఉన్న సర్వే నెం.969/45/బీలో ఉన్న భూమిలో దాదాపు 20 కుటుంబాల వారు నివాసం ఉంటున్నామన్నారు. ఈ భూములకు సంబంధించిన అన్ని రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలియజేశారు. అయితే తమ స్థలాలు టీటీడీకి చెందినవని స్థానిక బాజరు వీధికి చెందిన శ్రీనివాసులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. గత ఏడాది ఇలాగే టీటీడీకి ఫిర్యాదు చేశాడని గుర్తుచేశారు. అప్పట్లో టీటీడీ అధికారులు విచారణ జరిపి టీటీడీకి సంబంధం లేదని స్పష్టం చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం మళ్లీ ఐదురోజుల ముందు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు తప్పుడు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారం చేసిన అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నాగలాపురం మండలంలో దంచికొట్టిన వర్షం



అరుణానదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి ప్రవాహం

నాగలాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మోస్తారు వర్షం దంచి కొట్టింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. సురుటుపల్లి అరుణానది నీటి ప్రవాహం 6 అడుగులతో ఉధృతంగా ప్రవహిస్తోంది. కొట్ట కాడు గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న కాజ్‌వేపై నీటి ప్రవాహం ఎక్కువైంది. వాహన రాకపోకలు స్తంభించాయి. ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనారోగ్యానికి గురవడంతో స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు యువకులు భుజంపై మోసుకెళ్లారు. అలాగే నందనం గ్రామానికి వెళ్లే కాజ్‌వేపై రాకపోకలు నిషేధించారు.

వర్షం తెచ్చిన కష్టాలు తీర్చండి

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్‌ను గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వారంరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. దానిని అత్యవసరంగా పునరుద్ధరించాలని కోరారు. అలాగే వరదల వల్ల తరచూ అంతరాయం కలుగుతున్న ప్రాంతాల్లో హైలెవెల్ బ్రిడ్జిల నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నష్టపోయిన రైతులకు సాయం అందించాలని, వరదనీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్న కాలనీలను గుర్తించి తగిన సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఇందుకు కలెక్టర్ వెంకటేశ్వర్ సానుకూలంగా స్పందించారు.

ముంచెత్తిన వాన

- చప్టాలపై పారుతున్న వరద
- చెరువులు నిండి పారుతున్న కలుజులు
- నివాస గృహాల్లోకి చేరిన నీరు
- సముద్రతీర ప్రాంతాలు అతలాకుతలం
- మూడు గ్రామాలకు తెగిపోయిన సంబంధాలు





గూడూరు మండలం చెన్నూరు వద్ద రామలింగయ్య జగనన్నకాలనీలో ఇళ్లల్లోకి చేరిన వర్షపునీరు - నాయుడుపేట: ఉధృతంగా ప్రవహిస్తున్న మామిడి కాలువ

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ తీవ్ర రూపం దాల్చడంతో బుధవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కుండపోత వర్షం కురుస్తోంది. ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షం, జలాశయాల నుంచి విడు దల చేసిన నీటితో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గూడూరు మండ లంలోని వేములపాళెం చప్టాపై వరదనీరు ప్రవహిస్తుండడంతో మిటాత్మ కూరు వరకు సుమారు పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తిప్పవరప్పాడు సమీపంలో చప్టాపై నీటి ప్రవాహం పెరగడంతో గూడూరు నుంచి సైదాపురం - రాపూరు మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. గూడూరు పంబలేరు చప్టాపై ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలుపుదల చేశారు. గూడూరు చెరువు జలకళను సంతరించుకుంది. చల్లకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. నెల్లటూరు చవట గిరిజనకాలనీ, చెన్నూరులోని రామలింగయ్య గిరిజనకాలనీ, గూడూరులోని చవటపాళెం గిరిజన కాలనీల్లోని నివాసగృహాల్లోకి నీరు చేరి వస్తువులు తడిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ చవటపాళెం గిరిజనకాలనీని పరిశీలించి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మదురెడ్డికాలనీ సమీపంలో రోడ్డు గోతులమయంగా మారడంతో విందూరు మార్గంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తిప్పవరప్పాడు సమీపంలో రోడ్డు దుస్థితికి చేరుకోవడంతో సైదాపురం వెళ్లేవారు అవస్థలు పడుతున్నారు. చెన్నూరు గ్రామంలో సుమారు 200 మంది చేనేత కార్మికులకు చెందిన మగ్గం గుంటల్లోకి నీరు చేరడంతో పనులు లేక, వస్తువులను నష్టపోయారు. మండలంలోని 40 చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోకి మోకాళ్లలోతు నీరు చేరడంతో విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ, ఐసీడీఎస్ తదితర కార్యా లయాల ఆవరణలో నీరు చేరింది. వర్షాలకు చవటపాళెం, పురిటిపాళెం, నెల్లటూరు, తిప్పవరప్పాడు గ్రామాలతో పాటు పట్టణంలోని జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంతాల వారిని అక్కడకి తరలించి భోజన సదుపాయం కల్పించారు. మండలంలో సుమారు 1700 ఎకరాల్లో వరినాట్లు నీటమునిగాయి.

చిల్లకూరు: ఎడతెరపి లేని వానతో మండలంలోని తిప్పగుంటపాళెం, పారిచెర్లవారిపాళెం, రెట్టపల్లి, తీపనూరు గ్రామాల సమీపంలోని చప్టాల పైకి నీరు చేరింది. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలను నిలిపివేశారు. తిప్పగుంటపాళెం జలదిగ్బంధంలో చిక్కుకుంది. వరగలి క్రాస్‌రోడ్డు వద్ద సాగరమాల రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన సర్వీసు రోడ్డు దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు ఆగిపోయి గంటన్నర పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పారిచెర్ల వారిపాళెం, రెట్టపల్లి వద్ద చప్టాలపై వరదనీటి ప్రవాహాన్ని తహసీల్దారు శ్రీనివాసులు, ఎస్‌ఐ సురేష్‌బాబు పరిశీలించి రాకపోకలు నిలిపివేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో ఐదు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించి భోజన సదుపాయం కల్పించారు.

నాయుడుపేట: పండ్లూరు కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలను ఆపేశారు. తన్నమాల గ్రామానికి వెళ్లే తారురోడ్డు కోతకు గురైంది. పెరికలంపాటికండ్రిగ వద్ద సాగరమాల రోడ్డు అండర్‌బ్రిడ్జి భూమి ఉపరితలం కన్నా ఎత్తుగా ఉండటంతో వరదనీరు పొలాల్లోకి చేరింది. పట్టణంలో వర్షపునీరు నిల్వ చేరకుండా మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా మినీ ఎక్స్‌వేటర్‌తో డ్రైనేజీల్లో పూడిక తీయించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వర్షపునీరు చేరడంతో ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. మండలం లోని 57 చెరువులు నిండుకుండల్లా తొణికిసలాడుతున్నాయి. కొన్ని చెరువులు ప్రమాదభరితంగా ఉండటంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మామిడికాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తహసీల్దారు రాజేంద్ర పరిశీలించారు.

ఉప ముఖ్యమంత్రికి ఘనస్వాగతం, వీడ్కోలు



ఉపముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్

రేణిగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం, సాదర వీడ్కోలు లభించింది. గురువారం చిత్తూరు పర్యటన కోసం విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరు కున్న ఆయనకు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, శ్రీకాళ హస్తి, తిరుపతి, చంద్ర గిరి, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, అరవ శ్రీధర్, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి, శ్రీకా ళహస్తి మార్కెట్ చైర్మన్ చెంచయ్యనాయుడు, ఏఎస్పీ రవిమనోహర్ ఆచారి, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, జనసేన నాయకులు కిరణ్‌రాయల్, రాజారెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయం వెలుపల వేచి ఉన్న జనసేన కార్యకర్తలను ఉపముఖ్యమంత్రి పలకరించారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ కళాశాల బోధనేతర ఉద్యోగులు తమకు 23 నెలలుగా జీతాలు చెల్లించలేదని ఆయనకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన ప్రత్యేక కాన్వాయ్‌లో చిత్తూరు వెళ్లారు. కార్యక్రమం ముగించుకొని సాయంత్రం 4.30 గంటలకు తిరిగి విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు ఎస్పీ సుబ్బరాయుడు, జనసేన నాయకులు సాదర వీడ్కోలు పలికారు. ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

నేడు ఎమ్మెల్యే ప్రజా దర్బార్

రేణిగుంట డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ప్రజాదర్బార్ నిర్వహించ నున్నారు. ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వీఆర్‌కండ్రిగ కాజ్‌వేను పరిశీలించిన శంకర్‌రెడ్డి



సత్యవేడు, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు - ఊత్తుకోట్టై మార్గంలో వీఆర్ కండ్రిగ వద్ద ఉన్న కాజ్‌వేను సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. కాజ్‌వే రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో అప్పట్లో అధికారులు కాజ్‌వేకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వీఆర్‌కండ్రిగ చెరువు కలుజు నుండి వస్తున్న నీరు కాజ్‌వైపై ప్రవహిస్తోంది. నీటి ప్రవాహం ఎక్కువైతే కాజ్‌వే కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందున తాత్కాలిక చర్యలు చేపట్టవల సిందిగా అధికారులకు శంకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఈ మార్గంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో చేరండి

కేవీబీపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనం పొందే ప్రవేశ పరీక్ష కోసం సొంతంగా శిక్షణ ఇస్తున్నారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి కేంద్ర ప్రభుత్వం ఏటా 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12వేలు చొప్పున అంద జేస్తుంది.

వెలవెలబోతున్న వీధి వ్యాపారాలు



ఖాళీగా దర్శనమిస్తున్న కూరగాయలమార్కెట్ రోడ్డు

శ్రీకాళహస్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో వారం రోజులుగా కురుస్తున్న వర్ష ప్రభావంతో వీధివ్యాపారాలు వెలవెలబోతున్నాయి. పట్టణానికి నిత్యం సుమారు 50వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో సగటున 30వేల మంది భక్తులు ఆలయానికి వచ్చిపోతుంటారు. రోజుల తరబడి ముసురు వాతావరణం కొనసాగుతుండటంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఇక గ్రామీణ ప్రాంత ప్రజలు అయితే రవాణా కష్టాలు, చలి వాతావరణంతో గ్రామాలకే పరిమితమయ్యారు. దీంతో పట్టణంలో జనసంచారం గణనీయంగా తగ్గింది. దీంతో నిత్యం రద్దీగా కనిపించే ఆర్టీసీ బస్టాండు, కూరగాయల మార్కెట్, ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

వేడుకగా సురాపాల ఉత్సవం



నారాయణవనం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళ కార్తీక పున్నమి సందర్భంగా పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం సురాపాల ఉత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహిం చారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. సురాపాల ఉత్సవం సందర్భంగా సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనం అధిరోహించి మాడవీధుల్లో విహరిస్తూ ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. అప్పటికే భక్తులు తాటాకు మట్టలతో సిద్ధం చేసిన తాల వృక్షానికి సంప్రోక్షణ చేసి పూజలు నిర్వహించారు. హారతులు ఇచ్చి తాల వృక్షాన్ని అగ్నికి ఆహుతి చేశారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఉత్సవ మూర్తులకు ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను స్థానిక ఆలయాల సూపరిం టెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్, భక్తులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు

వడమాలపేట,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడి నేల ఆరోగ్యాన్ని కాపుడుతూ మంచి దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సౌభాగ్య లక్ష్మి పేర్కొన్నారు. పుత్తూరు డివిజన్ వడమాలపేట మండలంలోని రైతులకు భూసార పరీక్షలు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఏవో విజయకుమార్ పాల్గొన్నారు.

బాలుర గురుకులం అప్‌గ్రేడ్ ఎప్పుడు?



సత్యవేడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్యవేడులోని మహాత్మ జ్యోతీబా పూలే బాలుర గురుకుల పాఠశాల జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదన ఏళ్ల తరబడిగా కాగితాలకే పరిమితమైంది. పట్టణంలోని బాలుర గురుకుల పాఠశాలను 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఎన్.శివప్రసాద్ చొరవతో స్థానిక ఎన్‌ఎం కండిగ మిట్ట వద్ద తెలుగు గంగ పురాతన కార్యాలయం గదులలో ఏర్పాటు చేశారు. 50 మంది విద్యార్థులతో ఓ చిన్నపాటి రేకుల షెడ్డులో అరకొర వసతులతో ప్రారంభమైన గురుకుల పాఠశాల అంచెలంచెలుగా ఎదిగి పేద విద్యార్థుల పాలిట వరంగా మారింది. ఇక్కడ విద్యనభ్యసించిన ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత స్థానాలను ప్రసాదించిన ఘనత ఈ పాఠశాల సొంతం. ప్రస్తుతం పాఠశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కడప తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల అంకితభావం, సిబ్బంది సమష్టి కృషితో ప్రతీఏటా టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది.

వైసీపీ ప్రభుత్వంలో అవకాశం వచ్చినా..!

అయితే పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. వాస్తవానికి పాఠశాలకు 2021లో జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ అప్పటి వైసీపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన అప్పటి మంత్రి అడ్డుతగిలారు. జిల్లాలో ఒక పాఠశాలను మాత్రమే అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఆయన తన నియోజకవర్గానికి చెందిన పాఠశాలను అప్‌గ్రేడ్ చేయించుకున్నారు. దీంతో సత్యవేడు గురుకుల పాఠశాల అప్‌గ్రేడ్ ఫైల్ మరుగున పడిపోయింది. ఈ పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తే జిల్లాకు మారుమూలగా ఉన్న సత్యవేడు ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఇక్కడి ప్రజా ప్రతినిధులు పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. అదే విధంగా పాఠశాలలో సిబ్బంది నివాసం ఉండేందుకు 2013లో నిర్మించిన భవనాలు ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ప్రిన్సిపాల్ సైతం ఆఫీస్ రూమ్‌లోనే గడపాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. విద్యార్థులు ఉంటున్న డార్మిటరీకి కిటికీలు సరిగా లేకపోవడంతో కోతులు లోనికివెళ్లి పిల్లల వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. పాఠశాల ఆవరణలోనే డిగ్రీ కళాశాల, తెలుగు గంగ డీఈ కార్యాలయం ఉండడంతో పాఠశాల గేట్లు ఎప్పుడూ తెరచి ఉంటున్నాయి. దీంతో పాఠశాలకు ఎవరు వస్తున్నారు, ఎవరు వెళుతున్నారో తెలియడం లేదు. దీనిపై కూడా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పుత్తూరు వార్తలు

వేపగుంటలో బోరు మోటర్ల ఏర్పాటు



బోరు మోటర్లు అందజేస్తున్న నాయకులు

పుత్తూరు అర్బన్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలం వేపగుంట హరిజన వాడలో మూడు రోజులుగా నీటి సమస్య నెలకొంది. అత్యవసరంగా పీఎంఏజేవై పథకం ద్వారా రూ.3 లక్షల నిధులతో బోరు మోటార్లు కొనుగోలు చేశారు. గురువారం రాష్ట్ర పద్మశాలి కార్పొ రేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు అరవ బాలాజీ బోరు మోటర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి హేమంత్ కుమార్, మాజీ ఎంపీటీసీ కవిత, ఐ-టీడీపీ బుజ్జిబాబు, గ్రామ కార్యదర్శి కిరణ్, రమేష్‌బాబు, గౌతమి, రజిని, సజ్జమ్మ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు తనుశ్రీ



పుత్తూరు,డిసెంబరు4 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మెయిన్‌కు చెందిన తనుశ్రీ ఎంపికైంది. దీంతో గురువారం పాఠశాలలో అభినందన సభ జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, గుర్రప్ప, రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్‌కు చర్యలు

పుత్తూరు టౌన్, డిసంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అతిపెద్ద చెరువు గూలూరు చెరువు గుండా వెళ్లే విద్యుత్‌లైను ద్వారా నిరంతరాయ విద్యుత్‌ను అందించడానికి త్వరలో చర్యలు తీసుకుంటామని విద్యుత్ డీఈ దేవా ఆశీర్వాదం, ఏడీ రమేష్, ఏఈ జయసాయి పేర్కొన్నారు. గురువారం వారు గూలూరు చెరువులో విద్యుత్ తీగలను పరిశీలించారు.


సిద్ధ వైద్య మూలపురుషుడు

అగస్త్య ప్రచార రథానికి స్వాగతం



పుత్తూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిద్ధ వైద్యానికి మూల పురుషుడైన అగస్త్య మహాముని ప్రచార రథానికి గురువారం పుత్తూరు పొలిమేరలో తహ సీల్దార్ వెంకటేశ్వర్లు, మున్సి పల్ కమిషనర్ నాగేశ్వర రావు స్వాగతం పలికారు. కాశీ తమిళ్ సంఘం ఆధ్వర్యంలో తమిళనాడులోని తెన్‌కాశీ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని కాశీ వరకు ఈ ప్రచార రథం వెళుతోంది. ఈ సందర్భంగా చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ రుద్ర మాట్లాడుతూ ఈ సిద్ధ వైద్యాన్ని శివుడి నుంచి 18 మంది సిద్ధులు తెలుసుకున్నారని అన్నారు. ఈ సిద్ధులలో ఒకరైన అగస్త్య మహాముని గురించి ప్రపంచానికి చాటిచెప్పడం ప్రచారం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డైరెక్టరు రమణప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, ఎంఈఓ తిరుమలరాజులు పాల్గొన్నారు.

అప్పలాయగుంటలో వైభవంగా దీపోత్సవం



వడమాలపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మార్గశిరమాసం, కార్తీక పౌర్ణమి సందర్భంగా అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం ఉభయదేవరులతో ప్రసన్న వెంకటేశ్వరుడిని విశేషంగా అలంకరించి ఆలయ ఆవరణలో హారతులిచ్చారు. పుణ్యావచనం, లక్ష్మీపూజ, విశేష నివేదన చేశారు. ఆకాశ దీపం వెలిగించారు. అర్చకులు దీపాలను మేళతాలాలతో ఊరేగింపుగా పుష్కరిణి, ఆంజనేయ స్వామి ఆలయానికి తీసుకెళ్లి అక్కడ వెలిగించారు. మహద్వారం, గర్భాలయం, అమ్మవార్ల ఆలయాల్లో నెయ్యి దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవాణి. ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, అర్చకులు పాల్గొన్నారు.

కడసారి కష్టాలు



ఏర్పేడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పెనుమల్లం దళితవాడకు చెందిన జోగి దీనమ్మ(86) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. కుటుంబసభ్యులు ఆమెకు దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేశారు. మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించడానికి దారి లేక రైతుల పొలాల్లో గట్టుమీద నడుచుకుంటూ వెళ్లారు. సుమారు కిలోమీటరు వరకు పొలంలోనే వెళ్లాల్సిన పరిస్థితి. అధికారులు, నాయకులు కనీసం కడసారి కష్టాలైనా తీర్చాలని పెనుమల్లం దళితులు వేడుకుంటున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

డీడీవో కార్యాలయం ప్రారంభం



శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడులో గురువారం డీడీవో కార్యాలయాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు డీడీవో సుస్మిత పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడు, జడ్పీటీసీ సుబ్బారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో మామిడి మొక్కలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకం కింద పండ్ల తోటల విస్తరణలో భాగంగా సబ్సిడీపై మామిడి మొక్కలను ఇస్తున్నట్లు ఉద్యానవనశాఖాధికారి పుష్పలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఉద్యాన నర్సరీలో మామిడిమొక్కలు అందు బాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు 7995086968 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కూలిన అంగన్వాడీ భవనపు ప్రహరీ



కూలిన ప్రహరీని పరిశీలిస్తున్న సీడీపీవో కృష్ణవేణి

ఏర్పేడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మేర్లపాక గ్రామంలో తాత్కాలిక అంగన్వాడీ భవనం ప్రహరీ వర్షానికి బుధవారం కూలింది. మేర్లపాకలో అంగన్వాడీ భవనం లేదు. దీంతో ప్రాథమిక పాఠశాలకు చెందిన ఓ భవనంలో నిర్వహించేవారు. ఈ క్రమంలో ఆ భవనం కూడా శిథిలా వస్థలకు చేరుకోవడంతో పాఠశాలకు చెందిన మరో భవనంలోకి మార్చారు. ఈ క్రమంలో తొలుత నిర్వహించే భవనానికి చెందిన ప్రహరీ కూలిపోయింది. దీంతో సీడీపీవో కృష్ణవేణి ఆ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ రత్నమ్మ, టీడీపీ నాయకులు కేకే రమణ పాల్గొన్నారు.

వీఆర్‌వోల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



ఎన్నికైన కమిటీ జాబితాను తహసీల్దార్‌కు అందజేస్తున్న వీఆర్‌ఓలు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సూళ్లూరుపేట డివిజన్ సెక్రటరీ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగింది. మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా తేజరెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి మధుబాబు, సంయుక్త కార్యదర్శి హనీఫ్, కోశాధికారిగా ఆదిలక్ష్మిని ఎన్నుకున్నారు. కమిటీ జాబితాను తహసీల్దార్ శ్రీదేవికి అందజేశారు. నూతన కమిటీని వీఆర్‌ఓలు సన్మానించారు.

క్రీడా పోటీల్లో విజేతలకు సన్మానం



నాగలాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన బీరకుప్పం గ్రామం జడ్పీ హైస్కూలు విద్యార్థులను ఆ పాఠశాలు ఉపాధ్యా యులు సన్మానించారు. ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన బేస్‌బాల్ క్రీడా పోటీల్లో దీక్షిత అనే విద్యార్థిని జాతీయ స్థాయిలో విజేతగా నిలిచింది. రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో మీనా, నెట్‌బాల్ పోటీల్లో నితీష్, రగ్బీ పోటీలో లహరి, గుణశ్రీ, కబడ్డీలో కదిర్ అనే విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరిని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మునికృష్ణారెడ్డి, గోపి నాథ్‌లు సన్మానించారు. కాగా ఈ పోటీలు గత నవంబరు 22 నుంచి 30వ తేదీ వరకు జరిగాయి.

తూర్పున దంచికొట్టిన వాన



రాళ్లవాగువద్ద పోలీసుల భద్రతా చర్యలు

సత్యవేడు, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): మండలంలో గురువారం వేకువ జాము నుంచి ఉదయం వరకు వర్షం కుండ పోతలా కురిసింది. ప్రధాన రహదారులు జలమ యంగా మారాయి. సత్యవేడు నుంచి టీపీకోటకు వెళ్లే మార్గం పెద్ద పెద్ద గుంతలుగా మారడంతో అందులో వర్షపు నీరుచేరి వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆనందపురం ఎస్టీ కాలనీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్లవాగు వద్ద గురువారం కూడా వాహనాల రాకపోకలను నిషేధించారు. దీంతో ఈ మార్గంలో వరదయ్యపాళెం, సూళ్లూరుపేట, శ్రీసిటీ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. కాగా గురువారం ఉదయం ఎనిమిది గంటలకు మండలంలో 80 మి.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వరి రైతులను ఆదుకోండి

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరి పంట నీటమునిగిన బాధిత రైతులను ఆదుకోవాలని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు తనయుడు ఎస్సీవీ కిరణ్ కోరారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం పంచాయతీలోని గౌడమాల, కత్తివారికండ్రిగ, బసవన్న గుంట, తిక్కలతత్తూరు గ్రామాల్లో సుమారు వంద ఎకరాలపైన వరినాట్లు నీట మునిగాయని పలువురు రైతులు ఆయనకు మొరపెట్టుకున్నారు. దాంతో ఆయన తొట్టంబేడు మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

వేదోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన మేధో గురుదక్షిణా మూర్తికి గురువారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజ, కలశ పూజ తదితర వైదిక క్రతువులు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకం జరిపించారు. నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

అభిషేక సమయాలు మార్చకండి

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న అభిషేక సంప్రదాయాలను మార్చడం సరికాదని పాలక మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మాట్లాడుతూ ఆలయంలో నాలుగు కాలాల్లో అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ప్రాతఃకాలంలో ఉదయం 6గంటలకు జరిగే అభిషేకాన్ని 5గంటలకు, రెండవ కాల అభిషేకాన్ని 7 నుంచి 6గంటలకు మార్చడం సరికాదని సూచించారు. ఆలయ గురుకుల్‌ను, ఎమ్మెల్యేను సంప్రదించకుండా సంప్రదాయాలు మార్చడం శాస్త్ర విరుద్ధమన్నారు.

50శాతం సబ్సిడీతో 3హెచ్‌పీ చాఫ్ కట్టర్

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పశుసంవర్థక శాఖ తరపున 3హెచ్‌పీ చాఫ్ కట్టర్ (గడ్డికోసే యంత్రం)ను 50శాతం సబ్సిడీతో ఇస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ శ్రీకాళహస్తి అసిస్టెంట్ డైరెక్టర్ గోవింద రాజులు తెలిపారు. యంత్రం విలువ రూ.40,500 కాగా సబ్సిడీతో రూ.20,250కి ఇస్తున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తి నియోజక వర్గ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ దరఖాస్తులను సమీపంలోని సచివాలయ సిబ్బందికి అందజేయాలని తెలియజేశారు.

ఆహారం పంపిణీ



శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వారం రోజులుగా తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనలతో గురువారం తుఫాన్ సెంటర్‌లోని ప్రజలకు జడ్పీటీసీ సుబ్బారెడ్డి, కాంట్రాక్టర్ చిట్టెం శ్రీకాంత్, యువశేఖర్ ఆహారం పంపిణీ చేశారు.

స్తంభించిన జనజీవనం

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా ప్రజా రవాణా దెబ్బతిందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తొట్టంబేడు మండలంలో పర్యటించారు. కారాకొల్లు వద్ద కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంటంతో వారం రోజులుగా రాకపోకలు ఆగిపోయాయని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వీడియో కాల్ ద్వారా సంబంధిత మంత్రితో మాట్లాడారు. సమస్యను వివరించారు. పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పెద్దకన్నలి ఎస్టీ కాలనీలో తుఫాన్‌వల్ల నష్టపోయిన వారికి వెంటనే పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక టీడీపీ నాయకులు కన్నలి ప్రతాప్‌రెడ్డి, ఎస్టీకాలనీ వాసులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తేరువీధిలో కొలువైన షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామికి గురువారం కృత్తికను పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహిం చారు. ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేకాలు జరిపించారు. అనంతరం ప్రత్యే కంగా అలకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు భక్తులు పెద్దసంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వీడని వర్షం..పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు





పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు



ఇలగనూరు, తొట్టంబేడులో జలమయమైన వీధులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తూర్పు మండలాల్లో వారం రోజుల నుంచి వర్షం వీడటం లేదు. ప్రధానంగా బుధవారం నుంచి విడిచి విడిచి భారీ వర్షం నమోదు అవుతోంది. గురువారం కూడా ఉదయం, సాయంత్రం జోరువాన కురిసింది. వారం రోజులుగా వర్షం వెంటాడుతుండటంతో పలుచోట్ల వీధులు జలమయం అవుతున్నాయి. ఎక్కడ చూసినా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో మల్లిమడుగు రిజర్వాయర్ నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో స్వర్ణముఖి నదిలో గురువారం నుంచి మరింత నీటి ప్రవాహం పెరిగింది. తొట్టంబేడు మండలం ఇలగనూరు, కన్నలి ఎస్టీకాలనీలో వీధులపై నీరు స్తంభించింది. అధికారులు స్పందించి పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఇక తొట్టంబేడు మండలం కారాకొల్లుకు రాకపోకలు స్తంభించాయి. శ్రీకాళహస్తి ముళ్లపూడి ఎస్టీకాలనీకి రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఇదే మండలం గంగలపూడి, ఓబులాయపల్లె కాలువలు ఉప్పొంగడంలో అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.

నీట మునిగిన పంటలు



కాటూరు ఏరును పరిశీలిస్తున్న తహసీల్దార్



బీఎన్‌కండ్రిగలో వర్షానికి నీటమునిగిన మిరపపంట

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు, ఏరులు పొంగి పొర్లుతున్నాయి. బీఎన్‌కండ్రిగ, కనమనంబేడు, పదవమ్మెలు, మతకాముడి, కంచనపుత్తూరు గ్రామాలలో వేసిన వరి, మిరప పంటలు వర్షానికి నీట మునిగాయి. కాళంగి గేట్లు ఎత్తడంతో కాటూరు ఏరు ఉధృతంగా ప్రవహించడంతో తహసీల్దార్ శ్రీదేవి గురువారం పరిశీలించారు. ముంపునకు గురయ్యే గ్రామాలైన చిన్నాయగుంట, పూసలపల్లి, తహనగర్, జంబుగోళం గ్రామాల ప్రజలను తహసీల్దార్ అప్రమత్తం చేశారు.

భూసార ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలి

నారాయణవనం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని నేల ఆరోగ్యానికి ఇది ఎంతో అవసరమని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి తెలియజేశారు. గురువారం నారాయణ వనంలోని ఏవో కార్యాలయంలో రైతులకు భూసార పరీక్షలు, వాటి ఫలితాలపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఏవో శోభారాణి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో పంటలు సాగుచేస్తే ప్రజలకు, భూమికి మంచిదని వివరించారు.

మెగా పీటీఎంను జయప్రదం చేయండి

వరదయ్యపాళెం: ఈ నెల 5న శుక్రవారం మండలంలో నిర్వహించే మెగా పేరెంట్స్ మీటింగ్‌ను జయప్రదం చేయాలని డీవీఎంసీ మెంబరు గుత్తి త్యాగరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వారు వరదయ్యపాళెంలో మీడియాతో మాట్లాడారు.

ఏర్పేడులో భారీ వర్షం

- నీట మునిగిన పలుప్రభుత్వ పాఠశాలలు, ఏర్పేడు బీసీ హాస్టల్
- ముంపు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు, నాయకులు

ఏర్పేడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ప్రధానంగా శ్రీకాళ హస్తి నుంచి మునలిపేడు గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో అటవీప్రాంతం నుంచి చెరువులోకి వచ్చే కాలువ పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ క్రమంలో రోడ్డుతో పాటు ఆ మార్గంలో ఉన్న కల్వర్టు దెబ్బ తింది. అదేవిధంగా ఏర్పేడు బీసీ హాస్టల్ ఆవరణంలోకి భారీగా వర్షపునీరు చేరింది. విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా మోదుగుల పాళెం స్వర్ణముఖి నది వంతెనపై స్వర్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు మూడు రోజులుగా జరగడంలేదు. ఈ ప్రాంతాన్ని అధి కారులు పరిశీలించారు. ఎంఈవో ప్రేమ లత, ఇతర అధికారులు ముంపు ప్రాంతాలను పరిశీలించి పాఠ శాలలు, హాస్టల్ చుట్టూ నిల్వచేరిన వర్షపునీటిని తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నాగరాజునాయుడు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గాలి కృష్ణవేణి, ఏర్పేడు సర్పంచ్ శివయ్య, ఎంఈవో ప్రేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







బీసీ హాస్టల్ ఆవరణంలో చేరిన వర్షపునీరు - వెంటకపాళెం గిరిజనకాలనీలో కూలిన పూడి గుడిసెల వద్ద బాధితులు

ఉపాధి కోల్పోయిన భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా ఉపాధి కోల్పోయిన భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కత్తి రవి, సీపీఐ పట్టణ కార్యదర్శి రొద్ద గోపి డిమాండ్ చేశారు. గురువారం వారు భవన నిర్మాణ కార్మికులతో కలిసి పట్టణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. లేబర్ గుర్తింపు కార్డు, ఇన్సూరెన్సు, చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క కార్మికుడు తమలేబర్ గుర్తింపు కార్డును ఈశ్రమ పోర్టల్‌లో నమోదుచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రమేష్, దివాకర్, సురేష్, రవికుమార్, రమేష్, గురవయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తెగిన కాలంగి కట్ట..పూడి గ్రామాల ప్రజల కష్టాలు



కేవీబీపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడి గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే కాళంగి నదిపై నిర్మించిన మట్టి వంతెన తెగిపోయింది. దీంతో రెండు రోజులుగా పూడి గ్రామాలైన పూడి, పూడి సీకేపురం, ఎగువపూడి, దిగువపూడి, పోలినాయుడుకండ్రిగ గ్రామాలకు చెందిన ప్రజల అవస్థలు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. పాడిరైతులు మూడు రోజులుగా పాలు తరలించలేని పరిస్థితి. ఈ ఐదు గ్రామాల పాలు రాజులకండ్రిగకు చేరాల్సి ఉంది. ఈ గ్రామాలకు పూడి ఈ మార్గం ఒకటే కావడంతో బయటి ప్రపంచంతో సంబంధాలు తెగి పోయాయి. అధికారులు స్పందించి తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

స్వల్పంగా దెబ్బతిన్న శివనాథపాళెం చెరువుకట్ట



శివనాథపాళెం చెరువుకట్ట కోస నుంచి బయటకు వెళుతున్న నీరు

శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం శివనాథపాళెం చెరువు కట్ట స్వల్పంగా దెబ్బతింది. తుఫాన్ ప్రభావంతో చెరువు బుధవారం పూర్తిగా నిండింది. ఈ క్రమంలో ఓ వైపు చెరువు కట్ట అంచులో కలుజు పారుతుండగా పక్కనే కట్ట కొంత భాగం దెబ్బతింది. దీంతో చెరువు బ్యాక్ వాటర్ అక్కడినుంచి దిగువకు ప్రవహిస్తోందని తహసీల్దారు భారతి, ఇరిగేషన్ ఈఈ శివారెడ్డి తెలిపారు. శుక్రవారం పునరుద్ధరణ చర్యలు చేపడుతామని అధికారులు వెల్లడించారు.

అర్హులైన పేదలకు ఇంటి పట్టాలిస్తాం: ఎమ్మెల్యే ఆదిమూలం



ఎన్టీఆర్ కాలనీలో మౌలిక వసతులపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇళ్లు లేని పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయడానికి కలెక్టర్‌తో చర్చించి చర్యలు తీసుకుంటానని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. గురువారం ఆయన నారాయణవనంలోని ఎన్టీఆర్ కాలనీ లో పర్యటించారు. అక్కడి మౌలిక వసతులపై అధికారులను ప్రశ్నించారు. ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి స్వీకరించిన 230 అర్జీలలో 190 ఇంటి పట్టాల కోసమేనని, వెంటనే ఇంటి పట్టాల కోసం చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ కాలనీలో గతంలో 13 ఎకరాలు ల్యాండ్ అక్విజైజేషన్ చేసి సుమారు 600 మందికి పట్టాలు ఇచ్చారని గుర్తుచేశారు. కాలనీలో ఉన్న భూమితో మరో 300 మందికి ఇంటి పట్టాలు ఇవ్వవచ్చని కలెక్టర్‌తో చర్చించి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం మండల పరిధిలోని కీలగరం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.